

teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక

తీన్మార్ మెల్కోల్పు
చట్టం & న్యాయం లపై.....

తీన్మార్ తెలుగు దిన పత్రిక

తలపెట్టిన మెల్కోల్పు కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని అనుకునే వారు రచనలు, కవితలు & వ్యాసాలు

-: ఈ క్రింది మెయిల్ కి పంపించగలరు :-

teenmaardesk@gmail.com

ములుగు | సంపుటి: 04 | సంచిక: 299 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | పేజీలు : 8 | మంగళవారం 5 మే 2026 | వెల : 5-00

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad


# స్త్రీ నిధి ఉద్యోగాల భర్తీలో మతలబు?

## రోస్టర్ లేదు.. ఆర్థిక శాఖ అనుమతి లేదు

## అంతా ఇష్టారాజ్యమేనా..!

తెలంగాణ బ్యూరో, మే 04 (తీన్మార్ న్యూస్):

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని స్త్రీ నిధి క్రెడిట్ కోఆపరేటివ్ ఫెడరేషన్‌లో ఇటీవల విడుదలైన ఉద్యోగ నోటిఫికేషన్ ఇప్పుడు పెను వివాదానికి దారితీస్తోంది. 20 పోస్టుల భర్తీ కోసం గత నెల 29న విడుదల చేసిన ఈ No: 01/Recruitment-HO/Admin/SN/2026-27 నోటిఫికేషన్‌లో కనీస నిబంధనలు పాటించలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో పాటించాల్సిన రోస్టర్ పాయింట్ విధానాన్ని విస్మరించడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఏ సామాజిక వర్గానికి ఎన్ని పోస్టులు కేటాయించారో స్పష్టత లేకుండా నోటిఫికేషన్ ఇవ్వడం వెనుక, తమకు కావాల్సిన వారికే పదవులు కట్టబెట్టే కుట్ర దాగి ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆర్థిక శాఖ అనుమతి లేకుండానే నియామకాలా?

సాధారణంగా ప్రభుత్వ పరిధిలోని ఏ శాఖలోనైనా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్, కాంట్రాక్ట్ లేదా - మిగతా 2లో




# దేవాదాయ శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీ

## 190 ఈఓ పోస్టులకు త్వరలో నోటిఫికేషన్

హైదరాబాద్, మే 04 (తీన్మార్ న్యూస్):

తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగులకు ప్రభుత్వం మరో శుభవార్త వినిపించింది. రాష్ట్ర దేవాదాయ శాఖలో దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న సుమారు 190 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ నియామకాలను - మిగతా 2లో

# డిగ్రీలో కొత్త 15 కోర్సులు

## ఉద్యోగమే లక్ష్యంగా ఉన్నత విద్యామండలి ముందడుగు

## డిఫెన్స్, సైబర్ సెక్యూరిటీ, ఫిన్-టెక్ కోర్సులకు శ్రీకారం



హైదరాబాద్, మే 04 (తీన్మార్ న్యూస్):

తెలంగాణలోని డిగ్రీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఉన్నత విద్యామండలి భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా 15 నూతన కోర్సులను 2026-27 విద్యాసంవత్సరం నుండి అందుబాటులోకి తీసుకురానుంది. సాంప్రదాయ కోర్సుల కంటే ఐటీ, డేటా సైన్స్, అనలిటిక్స్ వంటి - మిగతా 2లో



# బీహార్, యూపీని తలపిస్తున్న తెలంగాణ

- 32 గంటలైనా నిందితులను పట్టుకోరా?
- పోలీసుల వైఫల్యంపై కేటీఆర్ ప్రశ్నల వర్షం
- కరీంనగర్ దోపిడీ ఘటనపై కేటీఆర్ ధ్వజం

కరీంనగర్, మే 04 (తీన్మార్ న్యూస్):

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. కరీంనగర్‌లో సోమవారం దుండగుల కాల్పులకు గురైన పీఎంజే జ్యువెలర్స్‌ను ఆయన సందర్శించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన కేటీఆర్, మాజీ మంత్రి గంగుల కమలాకర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ చరిత్రలోనే ఇదొక మాయని మచ్చ అని, పట్టపగలే తుపాకులతో చొరబడి కొల్లాది - మిగతా 2లో

# వ్యవసాయ రంగంలో సరికొత్త విప్లవం

## టీజీ ఆర్గానిక్స్ యాప్‌ను ప్రారంభించిన మంత్రి తుమ్మల



వికారాబాద్, మే 04 (తీన్మార్ న్యూస్):

వికారాబాద్ జిల్లా తాండూరులో జరిగిన 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' వేదికగా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని, మే 4 నుండి మే 9 వరకు నిర్వహించే లిరైతు వారోత్సవాలనులి - మిగతా 2లో

# ఐదు రాష్ట్రాల తీర్పుపై ప్రధాని మోదీ స్పందన



## బెంగాల్‌లో చారిత్రక విజయం

## రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది

న్యూ ఢిల్లీ, మే 04 (తీన్మార్ న్యూస్):

దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీ వేదికగా స్పందించారు. - మిగతా 2లో

# తమిళనాడులో విజయ్ ప్రభంజనం

## అభినందనలు కురిపించిన చిరంజీవి, పవన్, జగన్



హైదరాబాద్, మే 04 (తీన్మార్ న్యూస్):

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో సినీ నటుడు దళపతి విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కజగం' (ఎఖ) అద్భుత - మిగతా 2లో




# హైదరాబాద్‌కు 2,000 ఎలక్ట్రిక్ బస్సులు

## 2027 నాటికి నగరంలో డీజిల్ బస్సులకు పూర్తి స్వస్తి

2

# తెలంగాణ ఐసెట్ హాల్‌టికెట్లు విడుదల

## మే 13, 14 తేదీల్లో ఐసెట్ పరీక్షలు

2



# పాలమూరు గడ్డపై కవిత సమరశంఖం

## నీళ్ల పోరుకు సిద్ధమైన కల్వకుంట్ల కవిత

## ఈనెల 8న టీఆర్ఎస్ భారీ బహిరంగ సభ

## జోగులాంబ ఆశీస్సులతో రాజకీయ ప్రస్థానం ప్రారంభం



హైదరాబాద్, మే 04 (తీన్మార్ న్యూస్):

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత ప్రత్యక్ష రాజకీయ పోరాటానికి సిద్ధమయ్యారు. పార్టీ స్థాపన తర్వాత ఆమె తన తొలి రాజకీయ అడుగును పాలమూరు గడ్డ నుంచే వేయాలని నిర్ణయించుకున్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై గళమెత్తడమే లక్ష్యంగా ఈనెల 8న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో భారీ బహిరంగ సభకు శ్రీకారం చుట్టారు. గతంలో ప్రకటించిన విధంగానే జోగులాంబ అమ్మవారి ఆశీస్సులు తీసుకుని తన ఉద్యమ ప్రయాణాన్ని ప్రారంభించనున్నారు. 8వ తేదీ ఉదయం ఆలయ దర్శనం అనంతరం సాయంత్రం పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభలో ఆమె - మిగతా 2లో

# ఇంటర్ సప్లిమెంటరీ షెడ్యూల్ విడుదల

## మే 13 నుంచి పరీక్షలు షురూ

## మే నెలలోనే సప్లిమెంటరీ, ప్రాక్టికల్స్



హైదరాబాద్, మే 04 (తీన్మార్ న్యూస్):

తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థులకు మే నెలలోనే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు ఏర్పాట్లు చేస్తుంది. ఇప్పటికే పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్ కూడా విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు మే 13 నుంచి మే 21 వరకు ప్రతిరోజూ రెండు సెషన్లలో జరగనున్నాయి. ఇంటర్ - మిగతా 2లో

# వ్యవసాయ రంగంలో సరికొత్త విప్లవం

-మొదటిపేజీ తరువాయి

ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ముందెన్నడూ లేని విధంగా వ్యవసాయంలో ఆధునిక మరియు విప్లవాత్మక విధానాలను అమలు చేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా మంత్రి తుమ్మల లి'టీజీ ఆర్గానిక్స్' (౧+ రాతీస్త్రుఅఙఎం)లి అనే ప్రత్యేక మొబైల్ యాప్‌ను ఆవిష్కరించారు. ఈ యాప్ ద్వారా వినియోగదారులు నేరుగా రైతుల నుండి కల్తీ లేని ఆర్గానిక్ ఉత్పత్తులను కొనుగోలు చేయవచ్చు. కేవలం తెలంగాణ స్టేట్ సీడ్ అండ్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ ద్వారా ధృవీకరించబడిన ఉత్పత్తులు మాత్రమే ఇందులో లభిస్తాయని, మధ్యవర్తుల ప్రమేయం లేకపోవడం వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని ఆయన వివరించారు. వినియోగదారులు తమకు 50 కిలోమీటర్ల పరిధిలో ఉన్న రైతులను వెతికి తాజా కూరగాయలు, పండ్లు, ధాన్యాలను పొందే వీలుందని పేర్కొన్నారు. తాండూరు ప్రాంత అభివృద్ధిపై స్పందిస్తూ, ఇక్కడ త్వరలోనే లికంది బోర్డులి ఏర్పాటుకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. దేశానికే అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ ఎదిగిందని పేర్కొన్న ఆయన, కేంద్ర ప్రభుత్వం యూరియా సరఫరా విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. రైతుల కోసం మరిన్ని సేవలను ఈ మొబైల్ యాప్‌లో చేర్చుతామని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.



తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత పాలనలో వ్యవసాయం 'దండుగ కాదు పండుగ'గా మారిందని హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలన్నింటినీ ప్రభుత్వం నెరవేరుస్తోందని, నియోజకవర్గంలోని కోట్పల్లి, జుంటుపల్లి ప్రాజెక్టులతో పాటు ప్రాణహిత-చేవెళ్ల, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలా శిలాఫలకాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. అనంతరం నేతలు, అధికారులు కలిసి యాలాల మండలం జుంటుపల్లి సమీపంలోని ఆయిల్ పామ్ తోటలను పరిశీలించారు.

## ఐదు రాష్ట్రాల తీర్పుపై ప్రధాని మోదీ స్పందన

-మొదటిపేజీ తరువాయి

పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి, కేరళ, తమిళనాడు ఓటర్ల తీర్పును హుందాగా స్వీకరించిన ఆయన, ప్రజాస్వామ్య పండుగలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వికాసవంతమైన భారత్ నిర్మాణంలో ప్రతి రాష్ట్రం భాగస్వామి కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీ సాధించిన రికార్డు విజయంపై ప్రధాని ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు. తరతరాలుగా బీజేపీ కార్యకర్తలు చేసిన నిరంతర పోరాటం, త్యాగాల వల్లే ఈ అద్భుత ఫలితం సాధ్యమైందని ఆయన కొనియాడారు. క్షేత్రస్థాయిలో ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ, పార్టీ సిద్ధాంతాలను నమ్మి ప్రజల్లోకి తీసుకెళ్లిన కార్యకర్తల కృషిని అభినందించారు. అభివృద్ధి అజెండాను నమ్ముకున్న బెంగాల్ ప్రజలు తమకు పట్టం కట్టారని, రాష్ట్ర పురోగతి కోసం తమ శ్రమ నిరంతరం కొనసాగుతుందని మోదీ హామీ ఇచ్చారు. అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో ఎన్డీఏ కూటమిని ప్రజలు మరోసారి ఆశీర్వదించడంపై ప్రధాని సంతోషం వ్యక్తం చేశారు. అస్సాంలో తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను, సుపరిపాలనను ప్రజలు గుర్తించారని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఉంచిన ఈ అచంచలమైన నమ్మకం తమ బాధ్యతను మరింత పెంచిందని చెప్పారు. అలాగే పుదుచ్చేరిలో ఎన్. రంగస్వామి నేతృత్వంలోని ప్రభుత్వం చేసిన కృషిని ప్రజలు బలపరచడం శుభపరిణామమని కొనియాడారు. దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ ఫలితాలపై ప్రధాని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమిళనాడులో ఎన్డీఏకు మద్దతు ఇచ్చిన వారికి ధన్యవాదాలు తెలపడంతో పాటు, తొలి ఎన్నికల్లోనే విశేష ప్రదర్శన కనబరిచిన దళపతి విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీని ప్రత్యేకంగా అభినందించారు. కేరళలో విజయం సాధించిన యూడీఎఫ్ కూటమికి శుభాకాంక్షలు తెలియజేస్తూనే, కేరళ ప్రగతి కోసం కేంద్రం నుంచి పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని మోదీ స్పష్టం చేశారు.

## తమిళనాడులో విజయ్ ప్రభంజనం

-మొదటిపేజీ తరువాయి

ప్రభంజనం సృష్టించింది. రాజకీయ అరంగేట్రం చేసిన అతి తక్కువ కాలంలోనే విజయ్ సాధించిన ఈ చారిత్రాత్మక విజయం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అంచనాలను మించి టీవీకే పార్టీ భారీ విజయాల దిశగా దూసుకుపోతుండటంతో అటు సినీ రంగం, ఇటు రాజకీయ వర్గాల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన అగ్రనేతలు చిరంజీవి, పవన్ కల్యాణ్, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విజయ్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. విజయ్ సాధించిన ఘనతపై హర్షం వ్యక్తం చేశారు. "ప్రియమైన విజయ్.. తొలి పోరులోనే అద్భుత విజయాన్ని అందుకున్నందుకు హృదయపూర్వక శుభాకాంక్షలు. స్పష్టమైన లక్ష్యంతో ప్రజలకు నిరంతరం స్ఫూర్తినిస్తూ, వారిని ముందుండి నడిపించాలని ఆశిస్తున్నాను" అని పేర్కొన్నారు. తమిళనాడు ప్రజలకు భవిష్యత్తులో విజయ్ అందించబోయే సేవలు విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. మెగాస్టార్ చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. మరోవైపు ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ ఫలితాలపై ఆసక్తికర విశ్లేషణ చేశారు. తమిళనాడులో విజయ్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పట్టడం అనేది ఓటర్లలో ఉన్న మార్పు ఆకాంక్షకు నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు. పాలన బాగుంటే ప్రజలు ఆదరిస్తారని, లేదంటే నిర్దాక్షిణ్యంగా తీర్పునిస్తారని ఈ ఫలితాలు నిరూపించాయని పవన్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వస్తున్న తాజా ఎన్నికల ఫలితాలు ప్రజల బలమైన ఆకాంక్షను ప్రతిబింబిస్తున్నాయని ఆయన విశ్లేషించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా విజయ్‌ను అభినందిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. "నా ప్రియ సోదరుడు విజయ్‌కు హృదయపూర్వక అభినందనలు" అని పేర్కొన్న జగన్.. తొలి ప్రయత్నంలోనే టీవీకే ఒక పెద్ద శక్తిగా అవతరించడం విజయ్ పట్ల ప్రజలకున్న నమ్మకాన్ని చాటిచెబుతోందని కొనియాడారు. రాజకీయాలు అంటే కేవలం అధికారం కాదని, అది నిరంతర ప్రజాసేవ అని గుర్తు చేస్తూ విజయ్ కొత్త ప్రయాణానికి శుభాకాంక్షలు తెలిపారు. అగ్రనేతల అభినందనలతో తమిళనాడు రాజకీయాల్లో విజయ్ గెలుపు మరింత హాట్ టాపిక్ అయింది.

## జనాగ్రహసభ పేరుకు పీఎంవో ఆక్షేపణ

**హైదరాబాద్ :** దేశ ప్రధానిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత నరేంద్ర మోదీ తొలిసారిగా తెలంగాణ గడ్డపై అడుగుపెడుతున్నారు. ఈ నెల 10న జరగనున్న ఈ పర్యటన ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఒకవైపు కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు.. మరోవైపు రాజకీయ వ్యూహప్రతివ్యూహాల మధ్య ఈ పర్యటన సాగుతోంది. అయితే, పర్యటనకు ముందే చోటుచేసుకున్న ఒక అనూహ్య పరిణామం రాష్ట్ర బీజేపీని ఇరకాటంలో పడేసింది.మే 10వ తేదీన హైదరాబాద్ చేరుకోనున్న ప్రధాని మోదీ, రాష్ట్ర రాజధానితో పాటు పరిసర ప్రాంతాలకు సంబంధించిన పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్నారు. రైల్వే లైన్ల విస్తరణ, జాతీయ రహదారుల నిర్మాణం, మరికొన్ని మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులను ఆయన ప్రారంభించనున్నారు. ప్రధాని హోదాలో వస్తున్న మోదీ పర్యటనను అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు బీజేపీ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నాయి. ముఖ్యంగా మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తెలంగాణకు వస్తుండటంతో, ఈ పర్యటన ద్వారా రాష్ట్రంపై కేంద్రానికి ఉన్న చిత్తశుద్ధిని చాటిచెప్పాలని బీజేపీ నేతలు భావించారు.రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ లక్ష్యంగా ఈ పర్యటనను భారీ రాజకీయ వేదికగా మార్చుకోవాలని రాష్ట్ర బీజేపీ శాఖ వ్యూహం రచించింది. ఇందులో భాగంగా ప్రధాని పాల్గొనే బహిరంగ సభకు 'ప్రజాగ్రహ సభ' అని

## బీహార్, యూపీని తలపిస్తున్న తెలంగాణ

-మొదటిపేజీ తరువాయి

రూపాయల సంపదను దోచుకెళ్లడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. సంఘటన జరిగి 32 గంటలు గడుస్తున్నా నిందితులను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని కేటీఆర్ ఆరోపించారు. "బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ రక్షణ విభాగంలో దేశంలోనే అగ్రస్థానంలో ఉండేది. కానీ నేడు రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రం బీహార్, యూపీని తలపిస్తోంది" అని ఎద్దేవా చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం పోలీసు శాఖకు రూ.350 కోట్లతో కొత్త వాహనాలు ఇచ్చిందని, సేఫ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా కరీంనగర్‌లో 760 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం పోలీసు వాహనాల్లో డీజిల్ కూడా లేని దుస్థితి నెలకొందని, సామాన్యులపై కేసులు పెట్టడం తప్ప నేరగాళ్లను పట్టుకునే తెలివి పోలీసులకు లేకుండా పోయిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హోంశాఖను తన వద్దే ఉంచుకుని ఏం చేస్తున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. చందానగర్ దోపిడీ, కోఠి ఏటీఎం వద్ద కాల్పుల ఘటనల మిస్టరీ ఇప్పటికీ వీడలేదని, రాజధానితో పాటు రాష్ట్రమంతా భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులు కనీసం మాస్కులు కూడా ధరించకుండా దాడికి పాల్పడినా, వెంటనే నాకాబంధీ చేసి పట్టుకోవడంలో యంత్రాంగం విఫలమైందని విమర్శించారు. విద్యా, హోం, మున్సిపల్ వంటి కీలక శాఖలను సీఎం తన వద్దే పెట్టుకుని ప్రజల ప్రాణాలను హీనంగా చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ కక్షలు తీర్చుకోవడంపై ఉన్న శ్రద్ధ ప్రజల రక్షణపై లేదని కేటీఆర్ విమర్శించారు. ఘటన జరిగి ఇంత సమయం గడుస్తున్నా ప్రభుత్వం నుంచి బాధితులను పరామర్శించే నాథుడే లేకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా సీఎం మేలుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ సప్లిమెంటరీ షెడ్యూల్ విడుదల

-మొదటిపేజీ తరువాయి

ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండ్ ఇయర్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరగనున్నాయి. థియరీ పరీక్షలు ముగిసిన వెంటనే ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ప్రాక్టికల్ పరీక్షలు మే 22 నుంచి 25 వరకు జరుగుతాయి. ఇవి కూడా ఆయ తేదీల్లో రోజుకు రెండు సెషన్లలో జరుగుతాయి. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయి. మే 26వ తేదీన ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్ష, ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష నిర్వహిస్తారు. మే 28న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష ఉంటుంది. విద్యార్థులు తమ పరీక్షల సమయాన్ని, తేదీలను గమనించి సన్నద్ధం కావాలని ఈ సందర్భంగా ఇంటర్ బోర్డు సూచించింది. కాగా ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ ఫెయిలైన విద్యార్థులతోపాటు ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు రాసే విద్యార్థులు కూడా ఈ పరీక్షలు రాయవచ్చు. పూర్తి టైం టేబుల్ ఈ కింద చెక్ చేసుకోండి.

**ఇంటర్ సప్లిమెంటరీ ఎగ్జామ్స్ టైం టేబుల్:**

మే 13న సెకండ్ లాంగ్వేజ్
మే 14న ఇంగ్లిష్
మే 15న మ్యాథ్స్ ఏ, బోటనీ , పొలిటికల్ సైన్స్
మే 16న మ్యాథ్స్ 2ఏ, జువాలజీ, హిస్టరీ
మే 18న ఫిజిక్స్, ఎకనామిక్స్
మే 19న కెమిస్ట్రీ, కామర్స్
మే 20న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ , బ్రిడ్జి కోర్సు మ్యాథ్స్
మే 21న మోడ్రన్ లాంగ్వేజ్, జాగ్రఫీ

## హైదరాబాద్‌కు 2,000 ఎలక్ట్రిక్ బస్సులు

హైదరాబాద్, మే 04 (తీన్మార్ న్యూస్): భాగ్యనగరంలో వాయు, శబ్ద కాలుష్యాన్ని కట్టడి చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వ పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద టీజీఎస్ఆర్టీసీ ఏకంగా 2,000 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనుంది. ఈ బస్సులు 2026 సెప్టెంబర్ నుండి 2027 ఆగస్టు మధ్య కాలంలో నాలుగు విడతలుగా నగర రోడ్లపైకి రానున్నాయి. వీటి రాకతో నగరంలో పర్యావరణ పరిరక్షణ మెరుగుపడటమే కాకుండా, ప్రజలకు కాలుష్య రహిత ప్రయాణం అందుబాటులోకి రానుంది. నగరంలో ప్రజా రవాణాను మరింత బలోపేతం చేసేందుకు మెట్రో రైలుతో అనుసంధానతను పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా మెట్రో స్టేషన్లకు ప్రయాణికులను చేరవేసేందుకు (లాస్ట్ మైల్ కనెక్టివిటీ) అదనంగా 1,000 మినీ ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయాలని యోచిస్తోంది. ఇవి నగరంలోని గల్లీలు, చిన్న రోడ్ల గుండా ప్రయాణించి మెట్రో ప్రయాణికులకు రవాణా సౌలభ్యాన్ని కల్పిస్తాయి. ఈ మల్టీ-మోడల్ విధానం ద్వారా ట్రాఫిక్ రద్దీ తగ్గి, ప్రయాణ సమయం గణనీయంగా ఆదా కానుంది. 2027 సంవత్సరం నాటికి హైదరాబాద్ పరిధిలో డీజిల్ బస్సులను పూర్తిగా తొలగించి, 100 శాతం పర్యావరణ అనుకూల రవాణా వ్యవస్థను నెలకొల్పాలని టీజీఎస్ఆర్టీసీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ భారీ మార్పు వల్ల దాదాపు నాలుగు మిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు తగ్గుతాయని అంచనా. కాలుష్యం తగ్గడమే కాకుండా, శబ్దం లేని ప్రయాణ అనుభవం నగరవాసులకు లభించనుంది.

ఈ కొత్త ఎలక్ట్రిక్ బస్సులను అత్యాధునిక సాంకేతికతతో, ప్రయాణికుల సౌకర్యార్థం రూపొందించనున్నారు. లో-ఫ్లోర్ డిజైన్, ఏసీ సౌకర్యం, మొబైల్ ఛార్జింగ్ పాయింట్లు, మరియు ఎల్ఈడీ డిస్‌ప్లే బోర్డులు వంటి ఫీచర్లు ఈ బస్సుల్లో ఉండనున్నాయి. భద్రతా ప్రమాణాలకు పెద్దపీట వేస్తూ ప్రయాణికులకు అత్యుత్తమ అనుభూతిని అందించేలా వీటిని తీర్చిదిద్దుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## డిగ్రీలో కొత్త 15 కోర్సులు

-మొదటిపేజీ తరువాయి

ఆధునిక రంగాలకు ప్రాధాన్యతనిస్తూ ఈ విద్యా ప్రణాళికను సిద్ధం చేశారు. కేవలం థియరీ చదువులకే పరిమితం కాకుండా, డిగ్రీ పూర్తి కాగానే కార్పొరేట్ సంస్థల్లో నేరుగా ఉద్యోగాలు పొందేలా విద్యార్థులను తీర్చిదిద్దడమే ఈ మార్పు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి తెలిపారు. ఈ నూతన కోర్సుల అమలుకు రాష్ట్రవ్యాప్తంగా విద్యా సంస్థల నుండి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటికే 140కి పైగా కళాశాలలు ఈ కొత్త కోర్సులను ప్రవేశపెట్టేందుకు దరఖాస్తు చేసుకోగా, మరో 60 కళాశాలలు తమ పాత కోర్సులను నూతన కోర్సుల్లోకి మార్చుకోవడానికి (కోర్స్ కన్వర్షన్) మొగ్గు చూపాయి. దీనికి సంబంధించిన కసరత్తును ఉన్నత విద్యామండలి దాదాపు పూర్తి చేసింది. సిలబస్ రూపకల్పన, బోధనా పద్ధతులు మరియు అవసరమైన మౌలిక సదుపాయాలపై విద్యా నిపుణులతో చర్చించి సమగ్రమైన ప్రణాళికను రూపొందించారు. కొత్తగా ప్రవేశపెట్టిన 15 కోర్సుల్లో బీఏ విభాగంలో 3, బీబీఏలో 6, బీకామ్‌లో 3 మరియు బీఎస్సీలో 3 కోర్సులు ఉన్నాయి. వీటిలో 13 కోర్సులు మూడేళ్ల కాలపరిమితి కలిగి ఉండగా, మరో 2 కోర్సులు నాలుగేళ్ల హానర్స్ కోర్సులుగా ఉండనున్నాయి. బీఏ విభాగంలో డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ స్టడీస్, ల్యాండ్ అండ్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ వంటి వినూత్న కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయి. బీబీఏలో హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, ఎయిర్‌పోర్ట్ మేనేజ్‌మెంట్, స్పేస్ టెక్నాలజీ వంటి అత్యాధునిక కోర్సులను ప్రవేశపెడుతున్నారు. కామర్స్ విద్యార్థుల కోసం బీకామ్ ఫైనాన్స్ టెక్నాలజీ, ఇంటర్నేషనల్ బ్యాంకింగ్ మరియు డిజిటల్ మార్కెటింగ్ వంటి కోర్సులను రూపొందించారు. సైన్స్ విభాగంలో క్లైమేట్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్‌తో పాటు, డేటా సైన్స్ అండ్ ఏఐ/ఎంఎల్ (రూ×/మీూ), డిజిటల్ ఫోరెన్సిక్ సైన్స్ అండ్ సైబర్ సెక్యూరిటీ వంటి హానర్స్ కోర్సులను నాలుగేళ్ల కాలపరిమితితో ప్రవేశపెడుతున్నారు. ఈ సంస్కరణలు డిగ్రీ విద్యార్థుల కెరీర్‌కు కొత్త దిశను చూపుతాయని, విద్యార్థుల తలరాతలను మారుస్తాయని విద్యా నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## దేవాదాయ శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీ

-మొదటిపేజీ తరువాయి

డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో చేపట్టాలని నిర్ణయించడంతో, గ్రేడ్-1, గ్రేడ్-2 మరియు గ్రేడ్-3 స్థాయిల్లో అధికారుల నియామకం జరగనుంది. దేవాలయాల పరిపాలనను మరింత పటిష్టం చేయడంతో పాటు, భక్తులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ నియామకాల్లో భాగంగా చార్మినార్ జోన్ పరిధిలో అత్యధికంగా 67 పోస్టులను కేటాయించారు. ఇందులో హైదరాబాద్ జిల్లాలో గ్రేడ్-1 (5), గ్రేడ్-2 (4), గ్రేడ్-3 (14) పోస్టులు ఉండగా, రంగారెడ్డి జిల్లాలో గ్రేడ్-1 (1), గ్రేడ్-3 (6) పోస్టులు ఉన్నాయి. అలాగే మేడ్చల్ జిల్లాలో గ్రేడ్-2 మరియు గ్రేడ్-3 విభాగాల్లో చెరో 6 పోస్టులు, వికారాబాద్‌లో గ్రేడ్-2 (5), గ్రేడ్-3 (4) పోస్టులు ఉన్నాయి. సంగారెడ్డి జిల్లాలో గ్రేడ్-1 విభాగంలో 4 పోస్టులు, గ్రేడ్-2లో ఒక పోస్టు భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుండి డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. అభ్యర్థుల వయస్సు 18 నుండి 44 ఏళ్ల మధ్య ఉండవచ్చని అంచనా. ఎంపిక ప్రక్రియలో భాగంగా నిర్వహించే రాత పరీక్షలో జనరల్ స్టడీస్, కరెంట్ అఫైర్స్ తో పాటు దేవాదాయ శాఖకు సంబంధించిన ప్రత్యేక అంశాలపై ప్రశ్నలు ఉంటాయి. ప్రభుత్వ ఉద్యోగ భద్రతతో పాటు, సమాజంలో గౌరవప్రదమైన హోదా లభించే ఈ ఉద్యోగాల కోసం త్వరలోనే పూర్తిస్థాయి అధికారిక నోటిఫికేషన్ విడుదల కానుంది. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లుగా ఎంపికైన వారు దేవాలయాల ఆర్థిక లావాదేవీల పర్యవేక్షణ, ఉత్సవాల సమన్వయం, సిబ్బంది నిర్వహణ వంటి కీలక బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఈ ఉద్యోగాలకు భారీ పోటీ ఉండే అవకాశం ఉన్నందున, అభ్యర్థులు ఇప్పటి నుండే తమ ప్రిపరేషన్ ప్రారంభించాలని నిపుణులు సూచిస్తున్నారు. పూర్తి వివరాలు, దరఖాస్తు తేదీలు నోటిఫికేషన్ విడుదలైన తర్వాత స్పష్టమవుతాయి.

## స్త్రీ నిధి ఉద్యోగాల భర్తీలో మతలబు?

-మొదటిపేజీ తరువాయి

అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకాలు జరపాలంటే జీఓ ఎంస్ నెం. 275 మరియు జీఓ ఆర్టీ నెం. 4271 ప్రకారం ఆర్థిక శాఖ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి. అయితే, స్త్రీ నిధి యాజమాన్యం ఈ నిబంధనలను బేఖాతరు చేస్తూ సొంత నిర్ణయాలతో ముందుకు వెళ్తోందనే విమర్శలు వస్తున్నాయి. 2019 నుంచి నాన్చుతూ వచ్చిన ఈ ప్రక్రియను, ప్రస్తుత ఎండీ పదవీకాలం ముగుస్తున్న తరుణంలో హడావిడిగా చేపట్టడం వెనుక భారీ మతలబు ఉందని ఉద్యోగార్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి రాత పరీక్ష లేకుండా కేవలం ఇంటర్వ్యూల ద్వారానే భర్తీ చేయాలని చూడటం పారదర్శకతపై ప్రశ్నలు రేపుతోంది.


**లక్షల్లో వేతనాలు.. మహిళల సొమ్ముతో విందులా..?**

ఈ నోటిఫికేషన్‌లో పేర్కొన్న వేతనాల వివరాలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. సీనియర్ ఐటీ కన్సల్టెంట్, టీమ్ లీడర్ వంటి పోస్టులకు నెలకు రూ. 2.25 లక్షల భారీ వేతనాన్ని ఖరారు చేశారు. అలాగే జనరల్ మేనేజర్లకు రూ. 2 లక్షలు, ఇతర అధికారులకు లక్షకు పైగా వేతనాలు ఫిక్స్ చేశారు. పేద మహిళలు రూపాయి రూపాయి కూడబెట్టుకున్న పొదుపు సొమ్మును ఇలా లక్షల రూపాయల జీతాల రూపంలో తమ అనుయాయులకు ధారాదత్తం చేయడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలో 50 మందిని తీసుకుని, అందులో కేవలం 9 మందిని మాత్రమే రెగ్యులరైజ్ చేయడం వెనుక ఉన్న ఆంతర్యమేంటో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

**నిబంధనల ఉల్లంఘనపై విచారణకు డిమాండ్**

సహకార చట్టం 1964 ప్రకారం కేడర్ ఫిక్సేషన్ చేయాల్సి ఉన్నప్పటికీ, స్త్రీ నిధిలో ఇప్పటివరకు ఆ ప్రక్రియ పూర్తి కాలేదని సమాచారం. రిటైర్మెంట్ వయస్సు విషయంలోనూ ఎండీ తన ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో, స్త్రీ నిధిలో జరుగుతున్న అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై ప్రభుత్వం మరియు సంబంధిత శాఖ మంత్రి తక్షణమే దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. పారదర్శకత లేని ఈ నోటిఫికేషన్‌ను రద్దు చేసి, నిబంధనల ప్రకారం భర్తీ ప్రక్రియ చేపట్టాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

## తెలంగాణ ఐసెట్ హాల్‌టికెట్లు విడుదల




హైదరాబాద్, మే 04 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (టీజీ ఐసెట్) 2026 ప్రవేశ పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లు సోమవారం (మే 4) విడుదలయ్యాయి. ఐసెట్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్‌లో తమ రిజిస్ట్రేషన్ నంబర్ నమోదు చేసి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇప్పటికే ఈ పరీక్షకు సంబంధించిన షెడ్యూల్ కూడా విడుదలైంది. షెడ్యూల్ ప్రకారం విద్యార్థులకు మే 13, 14 తేదీల్లో ఐసెట్ ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు. ఈ పరీక్షలో వచ్చిన ర్యాంకు ద్వారా రాష్ట్రంలోని యూనివర్సిటీలు, అనుబంధ ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు కల్పిస్తారు. కాగా ఈ ఏడాది ఐసెట్ పరీక్షలను మహాత్మా గాంధీ యూనివర్సిటీ నిర్వహిస్తోంది. మే 29న ప్రిలిమినరీ కీ విడుదల చేస్తారు. అనంతరం జూన్ 19న ఫైనల్ కీ విడుదల చేసి ఆ వెనువెంటనే ఫలితాలు కూడా వెల్లడిస్తారు.

# మద్యం ధరలకు రెక్కలు



**హైదరాబాద్ :** తెలంగాణలో మద్యం ధరలు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు మద్యం ధరలు చివరిసారిగా 2023 మే నెలలో పెంచారు. ఆ తరువాత ఏడాదికిపైగా మద్యం ధరలు స్థిరంగా ఉండటంతో ప్రస్తుతం మరోసారి పెంపునకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. మద్యం ధరల పెంపుపై ప్రభుత్వం నియమించిన కమిటీ డిస్టిలరీల ప్రతిపాదనలను పరిశీలిస్తోంది. ఈ కమిటీలో ఆర్థిక, ఆమోదం, పరిశ్రమ శాఖల అధికారులు ఉన్నారు. ధరల పెంపునకు కారణాలు నివేదించనున్నారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులు, పన్నులు, రవాణా ఖర్చులు అధికమవడంతో ధరలు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఏ బ్రాండ్ పై ఎంత ధర ఉండనుంది అంటేమద్యం ధరలు గత రెండేళ్లుగా స్థిరంగా కొనసాగాయి. దీంతో డిస్టిలరీలు నష్టాలు చవిచూస్తున్నాయని తెలుపుతున్నారు. దీంతో వారి ప్రతిపాదనను రాష్ట్రప్రభుత్వం నియమించిన కమిటీకి నివేదించారు. దీనిపై కమిటీ పరిశీలిస్తోంది. ఇందులో భాగంగా సాధారణ బ్రాండ్ ఫుల్ బాటిల్‌పై రూ. 60, ప్రీమియం బ్రాండ్‌లపై రూ. 100, హయ్యర్ కేటగిరీ బ్రాండ్‌లపై రూ. 120 పెంపు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే డిస్టిలరీల నుంచి వచ్చిన ప్రతిపాదనల ఆధారంగానే పెంపు ఉంటుందని సమాచారం. రెండేళ్లకోసారి జరిగే ధరల సవరణ ఈసారి ఆలస్యం అయ్యింది. కాబట్టి రెండు రోజుల్లోనే అధికారిక ప్రకటన వచ్చే సూచనలు ఉన్నాయి. ఈ ధరల పెంపు ప్రజల జీబితంపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. మద్యంపై ఆసక్తి ఉన్నవారికి ఖర్చు ఎక్కువవుతుంది. అయితే ప్రభుత్వం దీని ద్వారా ఆదాయం పెంచుకోవాలని భావిస్తోంది. గతంలో కూడా ఇలాంటి పెంపులు జరిగాయి. ఈసారి పెంపు మేర తక్కువగా ఉంటే కూడా ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది. అధికారిక ప్రకటన తర్వాత బార్లు, వైన్సులల్లో కొత్త ధరలు అమలవుతాయి. డిస్ట్రిక్ట్‌ల వారీగా మార్కెటింగ్ విభాగం పరిశీలిస్తుంది. ప్రస్తుతం ఈ విషయంపై రాజకీయ చర్చలు జరుగుతున్నాయి. ప్రతిపక్షాలు దీన్ని విమర్శిస్తున్నాయి. మద్యం ధరల పెంపు రాష్ట్ర ఆర్థికాలకు ఎలా దోహదపడుతుందో చూడాలి. ఇదిలా ఉండగా ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో గణనీయంగా పెరిగాయి. ప్రభుత్వం బీర్ల గరిష్ఠ చిల్లర ధర (ఓఖీఖ)పై సుమారు 15 శాతం పెంపు జారీ చేసింది. దీంతో లైట్ బీర్ దాదాపు రూ. 150 నుంచి సుమారు రూ. 180కి పెరిగింది. స్ట్రాంగ్ బీర్ రూ. 160 నుంచి దాదాపు రూ. 190కి పెరిగింది. మరికొన్ని ప్రీమియం బ్రాండ్లలో ఒక్కో బీర్‌పై సగటున రూ. 30 నుంచి 40 వరకు పెంచారు. అయితే మద్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో బీర్ల ధరలు పెరుగుతాయా..? చూడాలి.

# గేమ్ ఛేంజర్ కానున్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్

**వరంగల్ :** తెలంగాణ పారిశ్రామిక ముఖచిత్రంలో వరంగల్ జిల్లా మరో చారిత్రాత్మక ఘట్టానికి వేదిక కాబోతోంది. గీసుకొండ, సంగెం మండలాల పరిధిలో 1,327 ఎకరాల్లో విస్తరించిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వ 'పీఎం మిత్ర' పథకం కింద బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన ఈ పార్క్‌ను, ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఇది కేవలం ఒక పారిశ్రామిక ప్రాజెక్ట్ మాత్రమే కాదు, ఉత్తర తెలంగాణ ఆర్థిక గమనాన్ని మార్చే ఒక గేమ్ ఛేంజర్. కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '5ఎఫ్' విజన్ (ఫార్మ్, ఫార్మ్ టు ఫైబర్, ఫైబర్ టు ఫ్యాక్టరీ, ఫ్యాక్టరీ టు ఫ్యాషన్, ఫ్యాషన్ టు ఫారిన్) కాన్సెప్ట్‌తో ఈ పార్క్ రూపుదిద్దుకుంది. అంటే పత్తి సాగు చేసే రైతు నుంచి, విదేశీ వీధుల్లో ఫ్యాషన్ దుస్తుల ప్రదర్శన వరకు ఒకే గొడుగు కింద కార్యకలాపాలు సాగుతాయి. ఇందుకోసం కేంద్రం మొదటి దశలో 200 కోట్లు కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గడిచిన రెండేళ్లలో పనులు శరవేగంగా పూర్తయ్యాయి. మొత్తం 1,695 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో అభివృద్ధి చెందిన ఈ పార్క్‌లో అత్యాధునిక మౌలిక సదుపాయాలు కల్పించారు. పరిశ్రమల కోసం ప్రత్యేకంగా 232/132/33 కేవీ పవర్ సబ్ స్టేషన్లు, 220 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్లు ఏర్పాటు చేశారు. రోజుకు 12 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేసే వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. పారిశ్రామిక వ్యర్థాలను శుద్ధి చేసేందుకు 5 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన 'సీఈటీపీ జీరో లిక్విడ్ డిశ్చార్జ్' ప్లాంట్ ట్రయల్ రన్‌లో ఉంది. ఒకప్పుడు పనుల జాప్యంతో నిరాశ చెందిన స్థానిక యువతకు, రైతులకు ఈ పార్క్ ఇప్పుడు ఆశాదీపంలా మారింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 24,400 మందికి నేరుగా ఉపాధి లభించనుంది. ఇప్పటికే 2 వేల మంది విధుల్లో ఉండగా, రానున్న రోజుల్లో శిక్షణ పొందిన వేలాది మందికి అవకాశాలు దక్కనున్నాయి. ఇప్పటికే గణేశా ఎకో, యంగ్ వన్ వంటి కంపెనీలు ఉత్పత్తి ప్రారంభించాయి. ప్రముఖ బ్రాండెడ్ కంపెనీ 'కైటెక్స్' కూడా ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఇప్పటివరకు 3842 కోట్ల పెట్టుబడులు రాగా, భవిష్యత్తులో ఇది 6వేల కోట్లకు చేరుతుందని అంచనా. 2017లో శంకుస్థాపన జరిగినప్పటి నుంచి ఎన్నో ఆటంకాలను దాటుకుని నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఓరుగల్లు గడ్డపై అంతర్జాతీయ స్థాయి టెక్స్‌టైల్ హబ్ సాకారమైంది. పార్క్‌లోని 62 శాతం భూములు ఇప్పటికే ఇండస్ట్రీలకు కేటాయించడమే దీనికున్న డిమాండ్‌కు నిదర్శనం. పత్తి పండించే రైతుకు గిట్టుబాటు ధర, స్థానిక యువతకు ఉద్యోగం, విదేశీ మారక ద్రవ్యాన్ని తెచ్చే ఎగుమతులు.. ఇలా అన్ని కోణాల్లోనూ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ తెలంగాణ ప్రగతి చక్రంలో కీలక మైలురాయిగా నిలవబోతోందితెలంగాణ పారిశ్రామిక ముఖచిత్రంలో వరంగల్ జిల్లా మరో చారిత్రాత్మక ఘట్టానికి వేదిక కాబోతోంది. గీసుకొండ, సంగెం మండలాల పరిధిలో 1,327 ఎకరాల్లో విస్తరించిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వ 'పీఎం మిత్ర' పథకం కింద బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన ఈ పార్క్‌ను, ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఇది కేవలం ఒక పారిశ్రామిక ప్రాజెక్ట్ మాత్రమే కాదు, ఉత్తర తెలంగాణ ఆర్థిక గమనాన్ని మార్చే ఒక గేమ్ ఛేంజర్. కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '5ఎఫ్' విజన్ (ఫార్మ్, ఫార్మ్ టు ఫైబర్, ఫైబర్ టు ఫ్యాక్టరీ, ఫ్యాక్టరీ టు ఫ్యాషన్, ఫ్యాషన్ టు ఫారిన్) కాన్సెప్ట్‌తో ఈ పార్క్ రూపుదిద్దుకుంది. అంటే పత్తి సాగు చేసే రైతు నుంచి, విదేశీ వీధుల్లో ఫ్యాషన్ దుస్తుల ప్రదర్శన వరకు ఒకే గొడుగు కింద కార్యకలాపాలు సాగుతాయి. ఇందుకోసం కేంద్రం మొదటి దశలో 200 కోట్లు కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గడిచిన రెండేళ్లలో పనులు శరవేగంగా పూర్తయ్యాయి. మొత్తం 1,695 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో అభివృద్ధి చెందిన ఈ పార్క్‌లో అత్యాధునిక మౌలిక సదుపాయాలు కల్పించారు. పరిశ్రమల కోసం ప్రత్యేకంగా 232/132/33 కేవీ పవర్ సబ్ స్టేషన్లు, 220 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్లు ఏర్పాటు చేశారు. రోజుకు 12 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేసే వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. పారిశ్రామిక వ్యర్థాలను శుద్ధి చేసేందుకు 5 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన 'సీఈటీపీ జీరో లిక్విడ్ డిశ్చార్జ్' ప్లాంట్ ట్రయల్ రన్‌లో ఉంది. ఒకప్పుడు పనుల జాప్యంతో నిరాశ చెందిన స్థానిక యువతకు, రైతులకు ఈ పార్క్ ఇప్పుడు ఆశాదీపంలా మారింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 24,400 మందికి నేరుగా ఉపాధి లభించనుంది. ఇప్పటికే 2 వేల మంది విధుల్లో ఉండగా, రానున్న రోజుల్లో శిక్షణ పొందిన వేలాది మందికి అవకాశాలు దక్కనున్నాయి. ఇప్పటికే గణేశా ఎకో, యంగ్ వన్ వంటి కంపెనీలు ఉత్పత్తి ప్రారంభించాయి. ప్రముఖ బ్రాండెడ్ కంపెనీ 'కైటెక్స్' కూడా ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఇప్పటివరకు 3842 కోట్ల పెట్టుబడులు రాగా, భవిష్యత్తులో ఇది 6వేల కోట్లకు చేరుతుందని అంచనా. 2017లో శంకుస్థాపన జరిగినప్పటి నుంచి ఎన్నో ఆటంకాలను దాటుకుని నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఓరుగల్లు గడ్డపై అంతర్జాతీయ స్థాయి టెక్స్‌టైల్ హబ్ సాకారమైంది. పార్క్‌లోని 62 శాతం భూములు ఇప్పటికే ఇండస్ట్రీలకు కేటాయించడమే దీనికున్న డిమాండ్‌కు నిదర్శనం. పత్తి పండించే రైతుకు గిట్టుబాటు ధర, స్థానిక యువతకు ఉద్యోగం, విదేశీ మారక ద్రవ్యాన్ని తెచ్చే ఎగుమతులు.. ఇలా అన్ని కోణాల్లోనూ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ తెలంగాణ ప్రగతి చక్రంలో కీలక మైలురాయిగా నిలవబోతోంది.

# మళ్లీ నిరాశేనా....



**హైదరాబాద్ :** తెలంగాణలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మంత్రివర్గ విస్తరణ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. మంత్రివర్గం నుంచి కొందరిని తొలగించే అవకాశం ఉండగా.. కొత్త వారికి సైతం కేబినెట్‌లో అవకాశం లభించనుంది. కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణ మంత్రివర్గ ప్రక్షాళన, విస్తరణపై ఫోకస్ చేయనుందని తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న ఖాళీల్లో మరో ఇద్దరు నేతల్ని రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకునేందుకు వీలుంది. ఇందులో ఒక స్థానాన్ని ఎస్టీ సామాజిక వర్గానికి కేటాయించే ఛాన్స్ ఉండటంతో రేసులో బాలూనాయక్, రామచంద్రునాయక్ వంటి నాయకులు ఉన్నారు. మంత్రి పదవి తమనే వరిస్తుందని దీమాగా ఉన్నారు. అయితే రామచంద్రునాయక్‌ను గత ఏడాది డిప్యూటీ స్పీకర్ పోస్టుకు ఖరారు చేసినప్పటికీ శాసనసభలో ఇంకా ఎంపిక ప్రక్రియ పూర్తి చేయలేదు. ఇక మరో మంత్రి పదవి బెర్త్ కోసం పలువురు నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాలకే అధిష్ఠానం ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో సీనియర్ నేతలు, పార్టీ రాష్ట్ర ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ సూచించే వారి పేర్లను సైతం కాంగ్రెస్ అధిష్టానం పరిశీలించనుంది. కొందరు మంత్రుల వ్యవహారశైలిపై ప్రజల్లో అసంతృప్తి ఉన్నందున పార్టీకి సైతం డ్యామేజ్ జరగకూడదని వారిని మార్చాలని రేవంత్ సూచించే అవకాశాలున్నాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి తెలంగాణ క్యాబినెట్‌లో ప్రాతినిథ్యం లేదు. మరోవైపు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క, సీతక్క మంత్రులుగా ఉన్నారు. నిజామాబాద్ నుంచి సీనియర్ ఎమ్మెల్యే పి. సుదర్శన్‌రెడ్డి ప్రస్తుతం క్యాబినెట్ హోదాలో ప్రభుత్వ సలహాదారుగా ఉన్నారు. ఆయనను మంత్రిగా తీసుకుంటారా లేక ఇదే జిల్లాకు చెందిన పీసీసీ చీఫ్, రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు అయిన మహేశ్‌కుమార్ గౌడ్‌కు మంత్రి పదవి దక్కుతుందా అనేది ఆసక్తికరంగా మారింది. అయితే రేవంత్ మాత్రం మహేష్ గౌడ్‌ను పార్టీ పరంగానే ప్రయోజనం కోసం పీసీసీ అధ్యక్షుడిగానే కొనసాగించే అవకాశాలు ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మరోసారి విజయం సాధించాలంటే మహేష్ గౌడ్ లాంటి నేత పార్టీ సారథిగా ఉండాలని రేవంత్ భావిస్తున్నారు. మంత్రి పదవి కోసం చాలా మంది రేసులో ఉన్నప్పటికీ ప్రత్యేకంగా వినిపించే పేరు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. మునుగోడు ఎమ్మెల్యే తనకు ఖచ్చితంగా అవకాశం లభిస్తుందని నమ్ముతున్నారు. అయితే ఆయన సోదరుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇప్పటికే మంత్రిగా ఉండటం మైనస్ అవుతోంది. కుటుంబం నుంచి ఒకే మంత్రి పదవి ఇవ్వాలని, రెండు పదవులు ఇవ్వకూడదని కాంగ్రెస్ హైకమాండ్ అభ్యంతరం తెలుపుతోంది. రేవంత్ రెడ్డి అధిష్టానంతో మాట్లాడి ఒప్పించడం అంత ఈజీ కాదని వినిపిస్తోంది. వీరితో పాటు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు, మల్‌రెడ్డి రంగారెడ్డి, మదన్‌మోహన్ రావు, రామ్మోహన్ రెడ్డి కూడా మంత్రి పదవి రేసులో ఉన్నారు. ప్రేమ్ సాగర్ రావుకు క్యాబినెట్ హోదాలో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు. కానీ ఆయన ఇంకా బాధ్యతలు చేపట్టలేదు. మంత్రివర్గ విస్తరణతో పాటు కొన్ని కీలక శాఖల్లో మార్పులు జరగనున్నాయని తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డికి అదనపు బారంగా మారిన కీలకమైన హోం శాఖ బాధ్యతను ఒక సీనియర్ మంత్రికి అప్పగిస్తారని పార్టీలోనూ వినిపిస్తోంది. ఇప్పటికే విద్యాశాఖ మంత్రిగా రేవంత్ ఉన్నప్పటికీ.. టెన్త్, ఇంటర్ ఫలితాలు ప్రభుత్వ సలహాదారు కేశవరావు విడుదల చేశారని తెలిసిందే. కేరళ ఎన్నికల ఫలితాల తర్వాతే తెలంగాణ మంత్రివర్గ ప్రక్షాళనపై కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం తీసుకుంటుంది. కనుక కేబినెట్ విస్తరణకు మరికొన్ని రోజులు వేచి చూడక తప్పదు.

## పాలమూరు గడ్డపై కవిత సమరశంఖం

-మొదటిపేజీ తరువాయి

పాల్గొంటారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టులో అత్యంత కీలకమైన కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సమీపంలోని చౌదరిగూడెం వద్ద ఈ బహిరంగ సభ జరగనుంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి 12 ఏళ్లు గడిచినా కృష్ణా జలాల వినియోగంలో వెనుకబడి ఉండటంపై కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాలకుల లోపభూయిష్ట విధానాల వల్లే మన నీళ్లు మనకు దక్కడం లేదని ఆమె ఆరోపిస్తున్నారు. కృష్ణా.. గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకుని బీడు భూములకు మళ్లించేలా స్పష్టమైన విధానాన్ని ఈ సభ ద్వారా ఆమె ప్రజల ముందుకు తీసుకురానున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదట శంకుస్థాపన చేసిన పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు పనులు ఇంకా 50 శాతం కూడా పూర్తి కాకపోవడంపై కవిత విస్మయం వ్యక్తం చేశారు. గతంలో నిర్వహించిన 'జనంబాట' కార్యక్రమంలోనే ప్రాజెక్టు జాప్యంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర.. రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచి ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు సాధించేలా ఉద్యమ ప్రణాళికను సిద్ధం చేశారు. రంగారెడ్డి జిల్లాకు నీళ్లు అందించే మూడు ప్యాకేజీల పనులు 11 ఏళ్లుగా ప్రారంభం కాకపోవడం పట్ల ఆమె పోరాటానికి సిద్ధమయ్యారు. హక్కుగా దక్కాల్సిన ప్రతి నీటి చుక్కను తెలంగాణ భూములకు మళ్లించేలా తమ పార్టీ కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. ఈ బహిరంగ సభకు సంబంధించిన గోడ పత్రికను బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు విడుదల చేశారు. తెలంగాణ రక్షణ సేన నాయకులు నవీన్ ఆచారి, గొంగళ్ల రంజిత్ కుమార్, సయ్యద్ ఇస్మాయిల్, నరేశ్ ప్రజాపతి, ఎదురుగట్ల సంపత్ గౌడ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాలమూరు గడ్డపై నిర్వహించే ఈ సభ ద్వారా తెలంగాణ రాజకీయాల్లో కొత్త వేడి పుట్టనుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సాధనే లక్ష్యంగా కార్యకర్తలు సన్నాహాలు చేస్తున్నారు.

## బీజేపీ పునాదికి మోదీ పర్యటన

**సికింద్రాబాద్ సభతో విపక్షాలకు వణుకే**

**రేవంత్, కేసీఆర్ నాకు లిల్లిపుట్లా కనిపిస్తున్నారు**

**ఎంపీ ధర్మపురి అరవింద్ సంచలన వ్యాఖ్యలు**

హైదరాబాద్, మే 04 (తీన్మార్ న్యూస్):



ప్రధాని నరేంద్ర మోదీ మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా మే 10వ తేదీన తెలంగాణకు వస్తున్నారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తెలిపారు. ఈ పర్యటన రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులకు నాంది పలుకుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ సాధించిన విజయం తర్వాత విపక్షాల్లో వణుకు మొదలైందని.. బెంగాల్ గెలుపు ముందు రేవంత్ రెడ్డి, కేసీఆర్ వంటి నేతలు తనకు లిల్లిపుట్లాగా కనిపిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. మే 10వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే మోదీ బహిరంగ సభను ఉద్దేశించి మాట్లాడుతూ.. సభ అంటే ఎలా ఉంటుందో రేవంత్ రెడ్డి, కేసీఆర్ ఆరోజు చూడాలి. అని సవాలు విసిరారు. 2028 అసెంబ్లీ ఎన్నికలకు తెలంగాణలో పునాది వేయడానికే మోదీ ఈ పర్యటన చేస్తున్నారని అరవింద్ పేర్కొన్నారు. దేశ భద్రత దృష్ట్యా తెలంగాణలో కూడా ఎస్ఐఆర్ అవసరమని.. అది జరిగి తీరాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్‌తో బీజేపీకి ఎలాంటి పొత్తులు ఉండవని.. ఈ విషయంలో తమ పార్టీ అధిష్టానం ఇప్పటికే పూర్తి స్పష్టత ఇచ్చిందని ఆయన పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు కురిపిస్తూ.. తెలంగాణలో ఆస్తులు అమ్మితే తప్ప ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేదని అరవింద్ ఆరోపించారు. అమ్మవారి మీద ఒట్టు వేసి మాట తప్పిన ముఖ్యమంత్రి నాశనం అవుతాడు. అని శాపనార్థాలు పెట్టారు అరవింద్. రేవంత్ రెడ్డి రాజకీయంగా, శారీరకంగా ఇకపై ఎదగరని వ్యక్తిగత వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ వందేళ్లు బతకాలని.. అయితే ఆయనకు టీవీ పెట్టి బీజేపీ విజయాలను చూపించాలని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమల్లో ఎలాంటి అడ్డంకులు ఉండవని.. బీజేపీ నాయకత్వంలో తెలంగాణ ప్రగతి పథంలో సాగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రధాని మోదీ రాకతో ప్రతిపక్షాలకు వణుకు పుడుతోందని.. రాష్ట్రంలో రాబోయే కాలం బీజేపీదేనని ధీమా వ్యక్తం చేశారు.

## కాళ్లతో మెట్రిక్యులేషన్ పరీక్షలు రాసిన బాలిక

సంకల్పం ఉంటే ఎలాంటి అడ్డంకులైనా అధిగమించవచ్చని మరోసారి నిరూపించింది ఒడిశాకు చెందిన ఓ బాలిక. పుట్టుకతోనే చేతులు లేకపోయినా, కాళ్లు సరిగా లేకున్నా పట్టు వదలని విక్రమార్కుడిలా చదువు కోసం పోరాడింది. చేతులు లేకపోతేనేం కాళ్లతో రాయడం నేర్చుకుంది. ప్రభుత్వం ప్రత్యేక సౌకర్యాలు కల్పించినప్పటికీ వాటిని పక్కనపెట్టి, ఇతర విద్యార్థుల్లానే పరీక్ష హాల్లో కూర్చొని తన ప్రతిభను చాటేది. ఆ పట్టుదలతోనే 10వ తరగతి పరీక్షలో అద్భుతమైన ఫలితాలు సాధించింది. అలా తల్లిదండ్రులను గర్వపడేలా చేస్తూ, ఇతరులకు ఆదర్శంగా నిలిచింది. ఆమెనే ఒడిశాకు చెందిన లక్ష్మీ ఖేముడు. ఆమె ప్రయాణం ఎలా సాగిందో ఈటీవీ భారత్? కథనంలో తెలుసుకుందాం.

**చిన్ననాటి నుంచే చేతులు లేవు**

మల్కన్‌గిరి జిల్లాలోని ధేపగుఢా గ్రామానికి చెందిన నారాయణ ఖేముడు రోజూవారి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. అతడి పెద్ద కుమార్తె లక్ష్మీ ఖేముడు. పుట్టుకతోనే శారీరక దివ్యాంగురాలు. లక్ష్మీకి చేతులు, కాళ్లు సరిగా పనిచేయవు. సొంతంగా నిలబడే శక్తి కూడా ఆమెకు లేదు. అందుకే ఆమె వీల్‌చైరే ఆధారంగా జీవిస్తోంది. అయితే ఆమెకు బాగా చదువుకోవాలనే కోరిక మాత్రం ఉంది. లక్ష్మీ కోరికను ఆమె కుటుంబం అర్థం చేసుకుంది. తమకు ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా లక్ష్మీని చదివించడానికి ఏ మాత్రం తల్లిదండ్రులు వెనుకాడలేదు. లక్ష్మీ తండ్రి ఐదో తరగతి వరకు చదివారు. ఆమె తల్లి సుభద్ర నిరక్షరాస్యురాలు. అయినప్పటికీ ఆ దంపతులు తమ కుమార్తెకు ఉన్న చదువుకోవాలనే కోరిక నేరవేర్చేందుకు సిద్ధమయ్యారు. అలా లక్ష్మీ సింధిమాల ఉన్నత పాఠశాలలో తన విద్యను అభ్యసిస్తోంది. లక్ష్మీ చేతులు లేకపోయినా కాళ్లతో రాయడం సాధన చేసింది. అలా పదో తరగతి వరకు అందరి విద్యార్థులాగానే పరీక్షలు రాస్తూ, మంచి మార్కులు సాధించేది. ఇటీవల జరిగిన పది పరీక్షలకు కూడా హాజరైంది. అయితే జిల్లా పరిపాలన దివ్యాంగుల కోసం ఇచ్చే ప్రత్యేక సదుపాయాలు కల్పించింది.

## ఈ ఎన్నికలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి

పశ్చిమ బెంగాల్‌లో కమలం వికసించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా విజయంపై ఆయన ఈమేరకు స్పందించారు. 2026 ఎన్నికలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. మరోవైపు.. అస్సాం ప్రజలు మరోసారి ఎన్డీయేను ఆశీర్వదించారని పేర్కొన్నారు. తమిళనాడులో టీవీకే అద్భుతమైన ఫలితాలు సాధించిందన్నారు. తమిళనాడు పురోగతికి, అక్కడి ప్రజల సంక్షేమానికి కేంద్రం పాటుపడుతూనే ఉంటుందని చెప్పారు. "బెంగాల్ ఎన్నికల్లో ప్రజాశక్తిదే పైచేయి అయ్యింది. భాజపా సుపరిపాలన రాజకీయాలు ఘన విజయం సాధించాయి. ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారు. వారికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. వారి కలలను, ఆశయాలను నెరవేర్చడానికి సాధ్యమైనంత మేర కృషి చేస్తాం. సమాజంలోని అన్ని వర్గాలకూ అవకాశాలు, గౌరవాన్ని కల్పించే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. అస్సాంలో సాధించిన గెలుపు.. అభివృద్ధికి, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి మేం చేస్తున్న ప్రయత్నాలకు లభిస్తున్న మద్దతును చాటిచెబుతోంది" అని ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

**భారత్ అంతా 'మోదీమయం'.. భాజపా ప్రత్యేక మ్యాప్**

కార్యకర్తల కృషి లేకపోతే బెంగాల్‌లో ఈ చరిత్రాత్మక విజయం సాధ్యమయ్యేది కాదని ప్రధాని మోదీ అన్నారు. ఏళ్ల తరబడి వారు క్షేత్రస్థాయిలో శ్రమించారని, ఎన్నో

తీన్మార్
నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

# ఓటర్ విలక్షణ తీర్పు


అధికారంలో ఉన్న పార్టీలు.. అభివృద్ధిని చేసి చూపించాలి. అంతేగానీ.. సంక్షేమ పథకాలు ఇస్తే సరిపోదు. ప్రజలు అలాంటి పార్టీలను తిరస్కరిస్తున్నారు బెంగాల్‌లో మోదీ ఎన్నికలకు ముందు.. మహిళల అకౌంట్లలో మనీ వేశారు. దాంతో మహిళల ఓట్లు తమకే అనుకున్నారు. అడ్డంగా ఫెయిల్ అయ్యారు. ఏపీలో వైసీపీ కూడా పథకాల ద్వారా గెలుస్తామని అనుకుంది. ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. తమిళ నాడులో డీఎంకే కూడా ఇలాగే దెబ్బైపోయింది. తెలంగాణలో బీఆర్ఎస్ కంటే.. ఎక్కువ పథకాలను ప్రకటించిన కాంగ్రెస్‌ని ప్రజలు గెలిపించారు. ఏపీలోనూ అదే జరిగింది. ప్రజలు పథకాలు ఎవరైనా ఇస్తారు.. ఎవరు ఎక్కువ ఇస్తే వారికే ఓటు అంటున్నారు. అదే సమయంలో.. పథకాలు మాత్రమే ఇస్తే, అలాంటి పాలనకు స్వస్తి పలుకుతున్నారు. అందువల్ల ఓటర్లను తక్కువ అంచనా వేసే పార్టీలకు షాకులు తప్పట్లేదు. తాజా ఫలితాలు ఇదే తెలియజేస్తున్నాయి. ప్రతీ రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలు బలంగా ఉంటాయి. అవి జాతీయ పార్టీలను ఎట్టి పరిస్థితుల్లో అధికారానికి రానివ్వకుండా చూసుకుంటాయి. కానీ.. కొన్నేళ్లుగా ఈ పరిస్థితి మారుతోంది. ముఖ్యంగా కేంద్రంలో నరేంద్ర మోదీ సారథ్యంలో బీజేపీ, ఎన్డీయే సర్కార్ 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రాంతీయ పార్టీలు గల్లంతవుతున్నాయి. ఇందుకు బీజేపీ వ్యూహాలు ఒక కారణమైతే, ఆ పార్టీల స్వయంకృత అపరాధాలు మరో కారణం. జమ్మూకాశ్మీర్‌లో ఎన్సీ, హర్యానాలో ఒడిశాలో బిజూ జనతాదళ్, పంజాబ్‌లో శిరోమణి అకాలీదళ్, బెంగాల్‌లో తృణమూల్, కర్ణాటకలో జేడీఎస్, మహారాష్ట్రలో శివసేన ఇలా ఎన్నో ప్రాంతీయ పార్టీలు.. తమ ఉనికిని కోల్పోతున్నాయి. అధికారానికి దూరమై, కనీసం ప్రతిపక్షాలుగా కూడా ప్రభావం చూపలేకపోతున్నాయి. ఇక కాంగ్రెస్ పార్టీ కూడా ప్రభావం చూపలేకపోతోంది. మరికొన్ని సందర్భాల్లో.. బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీలు బలహీనపడుతున్నాయి. ఇక్కడ బీజేపీ తన ఎదుగుదలకు పునాదిని నిర్మించుకుంటోంది. అది ఆ పార్టీలకు సమస్య అవుతోంది. కచ్చితమైన విధానాలు, సిద్ధాంతాలు, పట్టుదల, బలమైన వ్యూహాల వంటివి కమలం ఎదుగుదలకు కారణం అవుతున్నాయి. మొన్నటిదాకా బీహార్‌లో బలంగా ఉన్న జేడీయూ.. ఇప్పుడు బీజేపీకి అధికారాన్ని అప్పగించుకుంది. ఐతే.. సౌత్‌లో మాత్రం బీజేపీ పెనట్రేట్ అవ్వలేకపోతోంది. కర్ణాటక తప్పితే.. మిగతా రాష్ట్రాల్లో ప్రభావం చూపలేకపోతోంది. భాషా ప్రాంతీయతా భావం ఇక్కడ బలంగా ఉండటం కమలానికి సవాల్ అవుతోంది. అయినప్పటికీ.. దేశవ్యాప్తంగా ఆ పార్టీ విస్తరిస్తున్న తీరు మాత్రం.. సంచలనమే.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో మనం ఒక కొత్త విషయాన్ని గ్రహించవచ్చు. ఏపీలో జనసేన పార్టీ ఒంటరిగా పోటీ చెయ్యకుండా.. టీడీపీతో కూటమిగా పోటీ చేసి.. గ్రాండ్ సక్సెస్ అయ్యింది. ఈ పొత్తు వల్ల ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలలేదు. కానీ తమిళనాడులో విజయ్ ఇలా చెయ్యలేదు. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోలేదు. దాంతో.. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలినా.. ఎక్కువ ఓట్లు తనకే దక్కేలా చేసుకున్నారు. ఫలితంగా సింగిల్ లార్జెస్ట్ పార్టీగా ఇప్పుడు టీవీకే అవతరించింది. మెజార్టీ మార్క్ రాకపోయినా.. మరో 10 సీట్లతో పవర్ లోకి వచ్చేయవచ్చు. ఇందుకోసం చిన్న చిన్న పార్టీలతో పొత్తు పెట్టుకోవచ్చు. ఇలా ఒంటరిగా పోటీ చేసి బలమైన పార్టీగా ఎదగడం వల్ల ఇప్పుడు టీవీకే.. సొంతంగా అధికారంలోకి వచ్చే పరిస్థితిని తెచ్చుకుంది. ఈ ఛాన్స్ జనసేన తెచ్చుకోలేకపోయింది. ఏపీలో ఇప్పుడు జనసేన.. రెండో పెద్ద పార్టీగా ఉంది. కానీ.. టీడీపీతో పోల్చితే.. జనసేనకి ఉన్నవి 21 సీట్లే. నెక్ట్స్ ఎన్నికల్లో ఆ పార్టీ బలంగా ఎదగాలంటే.. ఒంటరిగా పోటీ చెయ్యాల్సి ఉంటుంది. కానీ.. 15 ఏళ్లు పొత్తుతోనే వెళ్తామని చాలా సార్లు డీసీఎం పవన్ కళ్యాణ్ చెప్పారు. అలా పొత్తుతో వెళ్లినంతకాలం.. జనసేన ఎదిగే అవకాశాలు ఉండవు. సీట్ల సర్దుబాటులో.. కొన్ని సీట్లతోనే సర్దుకోవాల్సి ఉంటుంది. అలాగే పవన్ కళ్యాణ్ సీఎం అయ్యే చాన్స్ కూడా మిస్సవుతుంది. అందుకే విజయ్.. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోకుండా.. ఇప్పుడు సీఎం అయ్యే ఛాన్స్ పొందారు. ఇదే జనసేనకి మైనస్ అవుతుంటే.. విజయ్‌కి ప్లస్ అయ్యింది. అఫ్‌కోర్స్ తమిళ పాలిటిక్స్ వేరు, మన ఏపీ పాలిటిక్స్ వేరు.. కానీ పరిస్థితులు అలా అయ్యాయని అనుకోవచ్చువిజయ్ వంటి కొత్త నాయకుడు రాజకీయాల్లోకి అడుగుపెట్టడం, ఆయన పార్టీకి వచ్చిన ఆధిక్యాలు చూస్తే, సహజంగానే అందరి దృష్టీ పడింది. దీని నుంచి అనుభవజ్ఞులైన నాయకులు సైతం గమనించగల కొన్ని విస్తృత రాజకీయ పాఠాలు ఉన్నాయి.ముఖ్యమైన పాఠాలలో ఒకటి కథనం, భావోద్వేగ అనుబంధ శక్తి. విజయ్ పట్ల ఆదరణకు కారణం, సంవత్సరాల తరబడి జాగ్రత్తగా తీర్చిదిద్దుకున్న తెరపై ఆయన ఉనికి. ఇది పెద్ద సంఖ్యలో మద్దతుదారులతో ఒక సిద్ధమైన భావోద్వేగ బంధంగా రూపాంతరం చెందింది. సినిమాల్లో ఆయన చెడును ప్రశ్నించే ధోరణి.. ప్రభుత్వాలకు ముఖ్యంగా బీజేపీకి వ్యతిరేకంగా నడుచుకునే ధోరణి.. ప్రాంతీయ తత్వం, ద్రవిడ వాదాన్ని బలపరిచింది. బీజేపీని వ్యతిరేకించేవారికి.. విజయ్ బలమైన సపోర్టర్‌గా నిలిచాడు.మరొక అంశం ప్రసంగాలు. విజయ్ ప్రసంగాలన్నీ దూకుడుగా, సూటిగా, సుత్తిలేకుండా సాగాయి. అలాగే.. ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపోశాయి. పూర్తిగా డీఎంకేని బలంగా టార్గెట్ చేశారు. దాంతో డీఎంకేని వ్యతిరేకించేవారికి.. విజయ్.. బలమైన ఆల్టర్నేట్‌గా కనిపించాడు. అదే సమయంలో అన్నాడీఎంకే.. అంతర్గత కల్లోలాలతో.. బలమైన నాయకత్వాన్ని ప్రజలకు చూపలేకపోయింది. దీంతో.. ప్రభుత్వ వ్యతిరేక ఓటు.. టీవీకేకి షిఫ్ట్ అయ్యింది.మన తెలుగు రాష్ట్రాల్లో అభిమానులు.. ఓట్లు వేస్తారనే గ్యారెంటీ లేదు. ఈ కారణంగానే ఇదివరకు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్.. రెండుచోట్ల పోటీ చేసి కూడా ఓడిపోయారు. ఆ తర్వాత ఈ లోటును గుర్తించిన ఆయన.. 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో.. అభిమానులను.. అభిమానం కాదు.. ఓటు వెయ్యాలి అని పదే పదే చెప్పడం వల్ల.. 100 శాతం స్ట్రైక్ రేటును సాధించగలిగారు. తమిళనా డులో తీరు వేరు అక్కడి ప్రజలు.. సినీ నేతలను విపరీతంగా అభిమానిస్తారు. అందువల్ల ఎన్నికల్లో పాల్గొనగానే.. బలంగా గెలిపిస్తారు. ఇది విజయ్‌కి బాగా సెట్ అయ్యింది.విజయ్ ఈ గెలుపు.. 27 నెలలది మాత్రమే కాదు. కొన్నేళ్లుగా ఆయన నిర్మించుకున్న అభిమాన సౌధానికి ఇది ప్రతిఫలం లాంటిది. బీజేపీకి వ్యతిరేకంగా ఆయన వినిపించిన వాణికి ఇది ప్రాంతీయ భాషా సపోర్టర్ల నుంచి వచ్చిన సపోర్టు లాంటిది. ఇలా విజయ్ వ్యక్తిత్వం, నాయకత్వం, మాట్లాడే తీరు, నడుచుకునే వ్యవహార శైలి అన్నీ కలిసి.. ఈ విజయం దక్కేలా చేశాయి. మరో వైపు 2024 లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ మార్క్ రాక, 240 సీట్లకే పరిమితమైన బీజేపీ.. ఆ తర్వాత పుంజుకున్న విధానం ఓ చరిత్ర. వరుసపెట్టి మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ ఇలా చాలా రాష్ట్రాల్లో అధికారంలోకి వస్తూ.. ఇప్పుడు 42 లోక్ సభ స్థానాలున్న బెంగాల్‌ని తమ సొంతం చేసుకుంది. అలాగే.. అసోం, పుదుచ్చేరిలో పట్టు నిలుపుకుంది. ఇది బీజేపీకి పెద్ద బూస్ట్. కమలానికి ఇదెలా సాధ్యమవుతుంది అంటే.. సింపుల్ ఆన్సర్ ఉంది. మిషన్ మోడ్. మిగతా పార్టీలు ఎన్నికలు వచ్చినప్పుడే.. మిషన్ మోడ్‌లో ఉంటాయి. బీజేపీ అలా కాదు.. ఎప్పుడూ అలాగే ఉంటుంది. చిన్న ఎన్నికను కూడా ఆ పార్టీ తేలిగ్గా తీసుకోదు. దేశమంతా తామే విస్తరించాలనే బలమైన కోరిక ఆ పార్టీని ముందుకు నడిపిస్తోంది. దానికి తోడు బలమైన సైద్ధాంతిక పునాది, హిందుత్వ వాదం, దేశభక్తి.. ఇవన్నీ కలిసి.. ఆ పార్టీని మిషన్ మోడ్‌లో ఉంచున్నాయి. వీటికి తోడు ప్రధాని మోదీ, అమిత్ షా ద్వయం.. నిరంతరం వ్యూహాలు రచిస్తూ.. పార్టీని ముందుకు తీసుకెళ్తున్నారు. నెక్ట్స్ తెలంగాణపై కమలం ఫోకస్ ఉండటంతో.. ఇక్కడి స్థానిక పార్టీల్లో ఇది కొంత కలవరం కలిగించే అంశంగా చెప్పుకోవచ్చు. ఐతే.. తెలంగాణలో బీజేపీ ఎదగగలదా అనేది అప్పుడే చెప్పలేం. ప్రస్తుతానికి తెలంగాణలో ఆ పార్టీ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ తర్వాత మూడో స్థానంలో ఉన్నట్లు కనిపిస్తోంది. అందువల్ల టాప్‌కి చేరడం అంత తేలిక కాదు, అలాగని అసాధ్యమూ కాదు. ఇకపై తెలంగాణ పాలిటిక్స్ మరింత ఉద్ధృతంగా ఉండటం ఖాయమనుకోవచ్చు.

# అందమైన నివాసం



మనిషికి ఆకాశంలోకి ఎగరాలన్న కాంక్ష పుట్టించేది పక్షి కాదు, తారలు కూడా కాదు, చదమామ! కథలు వినాలన్న ఆసక్తి పుట్టించడంలో నానమ్మ పాత్ర ఎంతో చందమామదీ అంతే. చందమామే ఒక కథ. ఒక కవిత కూడా. ఒక అందమైన స్త్రీ ఎలాంటి కవితావేశాన్ని కలిగిస్తుందో, నిండు చందమామ అలాంటి భావావేశాన్ని పుట్టిస్తుంది. అందుకే చందమామను తన అక్షరాల్లోకి ఒడిసిపట్టని భావకవులు ఉండరు. అసలు ఏ కవికైనా తన తొలి కవితకు సరంజామా ఇవ్వగలిగేది చందమామ కాక ఇంకేమిటి? అది మనిషికి ఎంత దూరమో అంత దగ్గర. ఈ నట్టనడి ఎండల్లో చంద్రుడి తలంపే మనకు చల్లని గొడుగు. 'నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు' అని తిలక్ అన్నప్పుడు ఈ వాక్యానికి అందం అందమైన ఆడపిల్లల వల్లే రాలేదు; వాళ్లు వెన్నెల్లో ఆడుకోవడం వల్ల వచ్చింది. చంద్రుడిని తలుచుకుంటేనే ఒక నెమ్మది, ఒక ప్రశాంతత, ఒక రహస్యోద్వేగం. అని మనిషిని మెలకువలోంచి కలల్లోకి మేలుకొలిపే మార్మిక మంత్రదండం. ఒంటరి ప్రయాణీకుడికి చందమామే దారి దీపం. అనంత చీకటిమయ ఆకాశాన్ని సజీవ మూర్తిగా నిలబెట్టేది దానికి రెండో కన్నుగా ఉండే చందమామే. పౌర్ణమికి దినదిన ప్రవర్ధమానమవుతూ, అమవసకు అంతా కోల్పోయినట్టవుతూ మనిషి జీవిత చక్రాన్ని ఇది గుర్తుచేస్తుంది. అన్ని మతాల్లోనూ, సంస్కృతుల్లోనూ చంద్రుడి చుట్టూ ముడివడి ఎన్నో పండుగలున్నాయి. అసలు శరదృతువులో పౌర్ణమిని చూడటమే ఒక పండుగ! చైనా భావకవితోద్యమానికి మార్గదర్శిగా చెప్పే లీ తై--పో క్రీ.శ. 699--705 ప్రాంతంలో జన్మించాడు. పదేళ్లకే కన్ఫ్యూసియస్ పుస్తకాలన్నీ చదివేశాడు. దేశమంతా తిరిగాడు. రాజప్రాసాదాల్లోనూ జీవించాడు, గుహల్లోనూ నిద్రించాడు. మద్యం, మగువ, కవిత్వం ఆయనకు ప్రాణాధారం. వెనుక సంచీలో పుస్తకాలు, అంగీ మడతలో గుప్తంగా పిడిబాకు, అరచేతిలో సిద్ధంగా కవిత-- ఇదీ ఆయన వేషం. ఒకరోజు తాగిన మత్తులో సరస్సులోని చంద్రుడి బింబాన్ని కౌగిలించుకోబోయి మరణించాడని చెబుతారు. ఎలాంటి భావకవి! ర్యోకన్ తైగు అనే జెన్ గురువు గుడిసెలోకి ఒక దొంగ వచ్చాడట. తన దుస్తులు సహా దొంగకు ఒలిచి ఇచ్చేశాడు గురువు. దొంగ వెళ్లిపోయిన తర్వాత, ఒంటి మీద నూలుపోగైనా లేకుండా నిండుగా వెలుగుతున్న చందమామను కిటికీలోంచి చూస్తూ కూర్చున్న గురువు, అంతటి అందమామను దొంగకు ఇవ్వలేకపోయినందుకు నొచ్చుకున్నాడట! దొంగలు మన దగ్గరినుంచి ఎత్తుకెళ్లలేనిది మన విద్య, వివేకాలనే కాదు, మనకున్న చందమామను కూడా! ఒక్క చంద్రుడుని నిండుగా ఆనందించగలిగే హృదయముంటే ఎన్ని పూటల భోజనానికి పడే ఆరాటం తప్పుతుంది! ఇటాలో కాల్వీనో కథా ప్రపంచంలోనైతే చందమామ మీదికి నిచ్చెన వేసుకుని ఒక్క గెంతులో ఎక్కేయొచ్చు. అక్కడి మీగడ చిక్కదనపు పాలను లోడుకోవచ్చు. దానికి చేయవలసిందల్లా పొక్కులుగట్టిన చందమామ ఉపరితలం మీదుండే పొలుసులను కొద్దిగా జరిపి అక్కడ గరిట పెట్టడమే! గ్రీకు ప్రకృతి దేవత మీదుగా నామకరణం చేసి, చంద్రుడి మీదకు 'నాసా' పంపిన వ్యోమనౌక ఆర్టెమిస్--2 ఏప్రిల్ 1--11 వరకు తిరుగాడి భూమ్మీదకు తిరిగొచ్చింది. భూమి నుంచి అంతరిక్షంలోకి సుదూరం పయనించి గతంలోని 'అపోలో' రికార్డును ఇది బద్దలుకొట్టింది. అన్నట్టూ అపోలో, ఆర్టెమిస్ గ్రీకు పురాణంలో కవల సోదరీమణులు. మొదలైనప్పటినుంచీ తిరిగొచ్చేదాకా 6,95,081 మైళ్లు ప్రయాణించిన ఆర్టెమిస్--2 అంతరిక్షంలోకి సుదూరంగా వెళ్లే వ్యోమగాములకు అవసరమైన వ్యవస్థలు సరిగ్గా పనిచేస్తున్నాయో లేదోనని నిర్ధారించేందుకు ఉద్దేశించినది. వస్తూవస్తూ సాక్ష్యంగా కొన్ని ఫొటోలను తెచ్చింది. వాటిని చూస్తే, చంద్రుడి మీద వెన్నెల మీగడలు ఏమీ లేవని తెలియడం ఒకింత కాల్పనిక నిరాశ. ఇది మామూలు భూమిలానే ఉందని తెలియడం ఒక వాస్తవం. కానీ చంద్రుడిపై మనుషులు దీర్ఘకాలంగా నివసించే దిశగా ఒక ముఖ్యమైన అడుగు కావడం సాంకేతిక సంభ్రమం.

# తొలినాటి సంద్రాలు



కథాసాహితి భారతీయ భాషలకు అంత అపరిచితమైందేం కాదని ఇంతకుముందోసారి అనుకున్న మాటేగా! మన దేశంలో నాలుగైదు వేల సంవత్సరాలుగా కావ్యేతిహాసాలు, మహాకావ్యాలు, కథాకావ్యాలు, అనగనగా కథలూ, పేదరాశి పెద్దమ్మ కథలూ, పుక్కిట పురాణాల్లాంటి సాహిత్య రూపాలు విస్తృతంగా ఉండేవి. సామాన్య శకానికి పూర్వం 24 వందల సంవత్సరాల కిందట కూడా కథన రూపాలు అస్తిత్వంలో ఉన్నాయంటారు. ఎటొచ్చీ, ఇప్పుడు మనకు తెలిసిన కథానికలు వేరు– ఆనాటి కథనాలు వేరు! సామాన్యశకం తర్వాత సాహిత్య చరిత్రలు అరకొరగానైనా లెక్కతేలిన తర్వాత, తెలుగు కథా కావ్యాకాశంలో, రవ్వల్లా తళుక్కున మెరిసే రచనలూ కొన్ని పుట్టుకొచ్చాయి. తాము తిక్కనకు ప్రత్యక్ష శిష్యులమని చెప్పుకున్న పదమూడో శతాబ్దినాటి మూలఘటిక కేతన, మారన–వారి సమకాలికుడే అయిన మంచన తదితరులు కథాకావ్యాలు రాసిన వారిలో ప్రముఖులు. మరో రెండు శతాబ్దాల నాటివాడైన జక్కన 'విక్రమార్క చరితం' కూడా కథాకావ్యమే. ఆ మాటకొస్తే శ్రీనాథుడి 'శృంగార నైషధం' మొదలుకుని ప్రబంధాలన్నీ కథాకావ్యాలే! అయితే వాటిల్లో కథకు చిన్నపీట వేసి, కవిత్వకళకే పెద్దపీట వేశారు మనవాళ్లు. అటు పడమటి ప్రపంచంలోనూ అదే 'కథ'. పదమూడు, పద్నాలుగు శతాబ్దాల నాటి 'రాబిన్‌హుడ్', 'విలియమ్ టెల్' కథలూ, పదహారో శతాబ్దినాటి దక్షిణ యూరోపియన్ మట్టివాసనలతో గుబాళించే పికారెస్క్యూ కథలూ, తమిళంలో మళైకళ్ళన్ (కొండ దొంగ) కథలూ, తెలుగులో 'ఆకాశరామన్న' కథలూ, హిందీలో 'సుల్తాన్ డాకూ' కథలూ అలాంటి తారలే! ఇక, కాశీమజిలీ కథలు సరేసరే! వాటి గొప్పతనాన్ని గౌరవిస్తూనే ఓ నిష్ఠుర సత్యం చెప్పుకోక తప్పదు. ఆధునిక కథానిక రూపురేఖలు తీర్చిదిద్దడంలో ఈ కథాకావ్యాల పాత్ర దాదాపు శూన్యం. కథానిక వస్తురూపాలూ, శిల్పంలో నగిషీలు మొనతేరడంలో ప్రధానపాత్ర పోషించిన ఇతర ప్రక్రియల విషయానికి వస్తే, నూరేళ్ల కిందట నిర్దిష్ట రూపం తీసుకున్న చిన్నకథ, పెద్దకథ తదితరాలను ప్రస్తావించాల్సి ఉంటుంది. అయితే ఈ సాహిత్య ప్రక్రియల విషయంలో గందరగోళానికి ముఖ్యకారణం నామకరణలో చోటుచేసుకున్న చిందరవందరలే. ఉదాహరణకి, చిన్నకథలుగా ప్రసిద్ధమైన కళాఖండాల్లో ఎక్కువ భాగం కథానికలు కావు–'వడ్ల గింజలు', 'మార్గదర్శి', 'బ్రాహ్మణాగ్రహారం' లాంటివైతే పేరుకు మాత్రమే చిన్నకథలు! పందొమ్మిదో శతాబ్ది చివర్లో వచ్చిన 'తెలుగు జనానా', 'హిందూ సుందరి', ఇరవయ్యో శతాబ్ది మొదట్లో వచ్చిన 'ఆంధ్రభారతి' లాంటి పత్రికల్లో అచ్చయిన కథానికలు, కథాకావ్యాలు ఈ క్రమాన్ని పైమెట్టుకు చేర్చాయి! 1947కు ముందే, ఇలాంటివి ఇరవయ్యొక్క పత్రికలు ఉండేవని పరిశోధకులు లెక్క తేల్చారు. ఆ పత్రికలూ, వాటిల్లో వచ్చిన రచనలూ కథానిక ప్రక్రియను తీర్చిదిద్దిన వాచకాల్లాంటివి. అలాంటి పత్రికల్లోనే భండారు అచ్చమాంబ కథలు దాదాపు డజను వరకూ, గురజాడ కథానికలు కనీసం రెండు అచ్చయ్యాయి. 1910లోనే కొమర్రాజు వెంకట లక్ష్మణరావు–క. రామానుజరావు అనే కలం పేరుతో–రాసిన కథానిక 'ఎద్దుల బేరం' కూడా అచ్చయింది. 'ఆంధ్రభారతి'లోనే మాడపాటి హనుమంతరావు రాసిన అనువాద కథానిక 'హృదయశల్యము' 1912లో అచ్చయింది. 'ఆంధ్రుల సాంఘికచరిత్ర'మనే చరిత్రాత్మక చరిత్ర గ్రంథాన్ని రాసిన సురవరం ప్రతాపరెడ్డి 'మొగలాయీ కథలు', 'వింత విడాకులు' లాంటి కథానికలు రాసిన సంగతి చదువుకున్న వారికి చాలామందికి తెలుసు. హిందూ స్త్రీ పునర్వివాహం విషయంలో–చట్టవిరుద్ధం కాని పద్ధతిలో– కమలమ్మ అనే క్లయింట్‌ను ఓ న్యాయవాది ఎలా చమత్కారంగా గట్టెక్కించాడో చెప్పిన కథానిక 'వింతవిడాకులు' స్వయంగా న్యాయవాదయిన ప్రతాపరెడ్డికి చట్టాల అంతరార్థాలకు ఎలా భాష్యం చెప్పాలో బాగా తెలియడంలో వింతేముంది?! 1922లో తాము మొదలుపెట్టిన సాహిత్యపత్రికలో, ఒద్దిరాజు సోదరులు (సీతారామచంద్రరావు, రాఘవరంగారావు) కనీసం మూడు కథానికలు ('రక్తమూల్యము', 'అదృశ్య వ్యక్తి', 'నటి' రాసినట్లు) తెలుస్తోంది. ఎటొచ్చీ, ఈ కథానికలకు అప్పట్లో ఆ 'పేరు' వాడుకలో లేదు! మాటలకు అర్థాలు, ధ్వన్యాశ్రయాలు కావు–అవి భావాలను ఆశ్రయించుకుని ఉంటాయంటారు పెద్దలు. తొలితరం తెలుగు సాహిత్య పత్రికల సంపాదకుల్లో వీరేశలింగం స్ఫూర్తిగా కలంపట్టిన వెంకటశివుడు ఆ కాలంలోనే ఆంగ్లంలో ఎమ్మే చేసి అధ్యాపకుడిగా పనిచేసినవారు. భండారు అచ్చమాంబ కథానికలను తొలిసారి అచ్చువేసి, లోకానికి పరిచయం చేసింది ఆయనే. అచ్చమాంబ తొలి కథలను అచ్చువేసిన మరో పత్రిక 'హిందూ సుందరి'. ఈ పత్రిక విశిష్టత ఏమిటంటే, నలభైయ్యేళ్లు నడిచిన ఈ పత్రిక పేరులోనే ఉన్నట్లుగా పాఠకురాళ్లను ఉద్దేశించి రూపొందింది. దానికి ఎడిటర్లు మొసలికంటి రామాబాయమ్మ–వెంపటి శాంతాబాయమ్మ. చరిత్ర మూలమలుపు తిరిగే ముందు పదిసార్లు ఆలోచిస్తుందేమో కానీ, ఆ తర్వాత దానికి జంకుండదు! అందుకే పులుగుర్త లక్ష్మీనరసమాంబ, వింజమూరి వెంకటరత్నమ్మ, కళ్లేపల్లి వెంకటరమణమ్మ తదితర సంపాదకురాళ్లు ఒకరి వెనుక ఒకరుగా పత్రికా రంగంలోకి ప్రవేశించారు. గృహిణులు అప్పుడప్పుడే కథానికలూ, వ్యాసాలూ చదవటం మొదలుపెట్టిన యువపాఠకుల కోసం ఉద్దేశించిన పత్రికలకు రూపురేఖలు దిద్దిన ఆ తరం రాయసం, కాశీనాథుని, ముట్నూరి, అయ్యంకి, గాడిచర్ల తదితరుల కృషి గురించి పత్రికలకూ–పుస్తకాలకూ ఎక్కి, చరిత్రగా స్థిరపడింది. అయితే, తెలంగాణ ప్రాంతంలో అలాంటి కృషే చేసిన సురవరం, ఒద్దిరాజు, శబ్నవీసు, వట్టికోట, ఆదిరాజు, బుక్కపట్నం, దేవులపల్లి (రామానుజరావు) తదితరుల కృషి ప్రాచుర్యంలోకి రాలేదు. 1910కి ముందు వెలువడిన 92 తెలుగు కథానికలను రాసిన తొలితరం కథానికల రచయితల జాడ తీసి పుణ్యం కట్టుకున్న పరిశోధక రచయిత వి.వి.న.మూర్తి. బుద్ధిరాజు ఈశ్వరప్ప పంతులు లాంటి విశిష్టమైన రచయిత పేరు 'దిద్దుబాటలు' వల్లనే వెలుగులోకి వచ్చింది. తెలంగాణ ప్రాంతంలో తెలుగు సాహిత్య ప్రస్థానం తీరుతెన్నులను ప్రభావితం చేయడంలో ఒద్దిరాజు సోదరులు లాంటివాళ్ల కృషిని గ్రంథస్థం చేసినవాళ్లలో ముఖ్యుడు 'కవిలె' సంగిశెట్టి శ్రీనివాస్. ఇకపై, ఈ పరిశోధన పేర్ల తేదీల వేటగా కాకుండా నిలువుకోత విశ్లేషణగా సాగటం ఈనాటి చారిత్రక అవసరం!

# ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాల బహిరంగ వేలం

**పరకాల, మే 04 (తీన్మార్ న్యూస్):**

పరకాల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ పి. తాతాజీ ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ రూరల్ జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు ఈ నెల 6వ తేదీ (బుధవారం) ఉదయం 9:00 గంటలకు పరకాల ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ఈ వేలం పాట కార్యక్రమం ప్రారంభం కానుంది. వివిధ నేరాల్లో పట్టుబడి, చట్టపరమైన ప్రక్రియ పూర్తయిన వాహనాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలం వేస్తున్నట్లు అధికారి వెల్లడించారు. ఈ వేలంలో పాల్గొనడానికి ఆసక్తి కలిగిన వారు ముందుగానే తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వేలం నిబంధనలు మరియు వివరాలు: వేలంలో పాల్గొనదలచిన వారు వాహనం యొక్క నిర్ణీత ధరలో 50 శాతం మొత్తాన్ని డిపాజిట్‌గా ముందుగా చెల్లించాల్సి ఉంటుంది. డిపాజిట్ చెల్లించిన వ్యక్తులకు మాత్రమే వేలంలో బిడ్ దాఖలు చేసే అవకాశం కల్పిస్తారు. నిబంధనల ప్రకారం అత్యధిక ధర పలికిన వారికి వాహనాన్ని అప్పగించడం జరుగుతుంది. ఆసక్తి గల వారు మరిన్ని వివరాల కోసం పరకాలలోని ప్రోహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ తాతాజీ కోరారు. బుధవారం ఉదయం నిర్ణీత సమయానికి వేలం ప్రారంభమవుతుందని ఆయన స్పష్టం చేశారు.

# జిల్లా, డివిజన్ స్థాయిల ప్రజావాణి దరఖాస్తులు 141





**ప్రజల సౌకర్యార్థం డివిజన్ స్థాయిలలో ప్రజా వారి నిర్వహణ**
**ప్రజావాణిలో తీరుకు హర్షం వ్యక్తం చేసిన ప్రజలు**

**వరంగల్ జిల్లా, మే 04 (తీన్మార్ న్యూస్):**

ప్రజావాణిలో మొత్తం దరఖాస్తులు 141 దరఖాస్తులు జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించినైనది. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నుండి 101 దరఖాస్తులు రాగా, డివిజన్ స్థాయిలలో వరంగల్ 26 నర్సంపేట 14 దరఖాస్తులు వచ్చాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యా రాణి, లోకల్ బాడీ వై.వి. గణేష్, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, డి ఆర్ ఓ విజయ లక్ష్మి, డి ఆర్ డి ఓ నాగ పద్మజ, డిఎం అండ్ హెచ్ ఓ సాంబశివరావు తదితర అధికారులు పాల్గొని ప్రజల నుండి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ ప్రజావాణికి 141 దరఖాస్ మొత్తం దరఖాస్తులు రెవెన్యూ శాఖకు సంబంధించినవి 63, పిడి హౌసింగ్ 14, జి డబ్ల్యూ ఎం సి 18 దరఖాస్తులు రాగా వివిధ శాఖలకు సంబంధించిన దరఖాస్తులు 46 వచ్చాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు ఎండార్స్ చేస్తూ, వాటిని సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొనగా, అధిక సంఖ్యలో దరఖాస్తుదారులు ప్రజావాణి కార్యక్రమానికి హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా స్థాయి తో పాటు డివిజన్ స్థాయి ప్రజావాణికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని ప్రజలు వారి సమస్యలను వారి పరిధిలోని ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించి సమస్యలు పరిష్కరించిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవడమే కాకుండా హర్షం వ్యక్తం చేశారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలి

**ములుగు డివిజనల్ స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ**
**జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్.మహేందర్.జి**

**ములుగు :** ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో ఫిర్యాదుదారులు అందించిన అర్జీలను సత్వరమే వేగంగా పరిష్కరించాలని,రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డివిజనల్ స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ములుగు జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి. హెచ్. మహేందర్.జి తెలిపారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సి. హెచ్. మహేందర్. జి,డివిజనల్ స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్ ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 55 దరఖాస్తులు రాగా వాటిలో ఇందిరమ్మ ఇండ్లకు 12,పెన్షన్ లకు10,ఇతర శాఖలకు సంబంధించినవి 10,డివిజనల్ స్థాయి లో భూ సమస్యలకు సంబంధించి 23దరఖాస్తులు అందాయి.

## ఆర్డీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం

**హనుమకొండ, మే 04 (తీన్మార్ న్యూస్):**

ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేస్తూ డివిజనల్ స్థాయిలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో హనుమకొండ జిల్లాలోని హనుమకొండ, పరకాల ఆర్డీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. హనుమకొండ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో రాథోడ్ రమేష్, పరకాల రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవో డాక్టర్ కన్నం నారాయణ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.




హనుమకొండ ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమానికి 10 దరఖాస్తులు అందగా, పరకాల ఆర్డీవో కార్యాలయంలో 27 అర్జీలు ప్రజల నుండి స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీవోలతోపాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే..

## బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మి నరసింహారావు

**మళ్లీ కేసీఆర్ పాలన కోసం ప్రజలంతా ఎదురుచూపులు**
**క్రీడల పట్ల యువత ఆసక్తి పెంచుకోవాలని సూచన**

**వేములవాడ :** అబద్దాల హామీతో అధికారంలోకి వచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది అని వేములవాడ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. వేములవాడ పట్టణంలోని ఆయన నివాసంలో వేములవాడ రూరల్ చెందిన క్రికెట్ క్రీడాకారులకు సోమవారం క్రికెట్ కిట్ లను అందజేసి మాట్లాడారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను అన్ని విధాలుగా మోసం చేస్తుందని అన్నారు. మళ్లీ మరోసారి సీఎంను కేసీఆర్ చేయాలని యువత చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందు ఉండాలని, క్రీడాకారులను ప్రోత్సహించడానికి కేసీఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించామని అన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ లో కాంగ్రెస్ కరువు ప్రభుత్వం వచ్చాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నరని, అబద్ధపు హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను మర్చిపోయాని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి కెసిఆర్ ను సీఎం చేసేందుకు ప్రజలు సిద్ధమవుతు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. కేటీఆర్ ముఖ్యమైన మంత్రి, ఆయన సహకారంతో రానున్న రోజుల్లో వేములవాడ ను అభివృద్ధి చేసుకుందామన్నారు. కేసీఆర్ కప్ తో క్రికెట్ క్రీడాకారులకు క్రీడా స్ఫూర్తి పెంపొందడమే కాకుండా గ్రామీణ స్థాయి నుండి క్రీడాకారులు తమ ప్రతిభను



చాటారన్నారని కొనియాడారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా క్రీడల పట్ల ఆసక్తి చూపేందుకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముందున్నారని గుర్తు చేశారు. క్రికెట్ ఏ కాకుండా భవిష్యత్తులో కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్ల నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహిస్తామని తెలిపారు. టోర్నమెంట్ లో పాల్గొన్న అన్ని జట్లకు కేటీఆర్ ఆదేశాల మేరకు క్రికెట్ కిట్లను అందజేసి వారికి ప్రోత్సాహంగా ఉండడమే కాకుండా భవిష్యత్‌లో ఇలాంటి క్రీడలను ప్రోత్సహించి క్రీడాకారులను వెలికి తీస్తామని తెలిపారు. అనంతరం యువతకు సమాజంలో జరుగుతున్న పలు అంశాలపై అవగాహనా కల్పించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి చల్మెడ ఎప్పుడు అండగా ఉంటారని, హాస్పిటల్ ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నరని కొనియాడారు. వేములవాడ నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజలు చల్మెడ వస్తే అభివృద్ధి జరుగుతుందే, కేసీఆర్ వస్తే కరువు లేకుండె అంటున్నారని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు చల్మెడ కే పట్టం కడుతారని, పార్టీలకు అతీతంగా ప్రజా సేవ చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గోస్కుల రవి, గడ్డం హనుమాన్లు, ఏష తిరుపతి, మల్లేశం, బాల్ రెడ్డి, యవకులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్.మహేందర్.జి**

**ములుగు జిల్లా, మే 04 (తీన్మార్ న్యూస్):**



జిల్లాలోని నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్.మహేందర్.జి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మే8న ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగే మెగా జాబ్ మేళా పోస్టర్ ను అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి,ఆర్ డి ఓ వెంకటేష్,జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ సిద్దార్థ రెడ్డి లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా మే 8న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డీఈఈట్, టాస్క్, ఉపాధి కల్పన కార్యాలయ సమన్వయంతో సుమారు 100 ప్రముఖ కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటాయని తెలిపారు. ములుగు జిల్లాలోని లోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాబ్ మేళా సమాచారం ప్రతి ఒక్కరికి చేరేలా వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియాను ఉపయోగిస్తూ ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూసేవారికి సమాచారం చేరేలా చూడాలని, టాస్క్ లో నమోదు చేసుకున్న యువతకు కూడా సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన క్రీడల శాఖ అధికారి బి.రామ్మోహన్, ఉపాధి కల్పన అధికారి కొమురయ్య, పౌర సంబంధాల అధికారి ఎండి రఫీక్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలి

**జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్.మహేందర్.జి**

**ములుగు జిల్లా, మే 04 (తీన్మార్ న్యూస్):**



ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదుదారులు అందించిన అర్జీలను సత్వరమే వేగంగా పరిష్కరించాలని,రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డివిజనల్ స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ములుగు జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్.జి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సి.హెచ్.మహేందర్.జి, డివిజనల్ స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో ఆర్ డి ఓ వెంకటేష్ ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 55 దరఖాస్తులు రాగా వాటిలో ఇందిరమ్మ ఇండ్లకు 12,పెన్షన్ లకు10, ఇతర శాఖలకు సంబంధించినవి 10, డివిజనల్ స్థాయి లో భూ సమస్యలకు సంబంధించి 23 దరఖాస్తులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి సమస్యల అర్జీలను నేరుగా అదనపు కలెక్టర్ స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును వ్యక్తిగతంగా పరిశీలించి సంబంధిత శాఖలకు వెంటనే ఎండార్స్మెంట్ చేయడం జరిగిందని తెలిపారు. డివిజన్ స్థాయిలో అందిన భూ సమస్యల దరఖాస్తులను వెంటనే సంబంధిత మండల తాసిల్దార్ లకు ఆన్లైన్ లో ఫార్వర్డ్ చేయడం జరిగిందని స్పష్టం చేశారు. ప్రజలకు సమయపాలనతో సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందిన ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని, దరఖాస్తుదారునికి వెంటనే కంప్యూటర్ ఆధారిత రశీదు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలపై దరఖాస్తులు అందించినవారు తమ సమస్య స్థితిగతులను కంప్యూటర్ రసీదు ద్వారా పరిశీలించుకోవచ్చు అని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతిని ప్రాధాన్యంగా తీసుకుని,నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మే 04 (తీన్మార్ న్యూస్):**



సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి 55 దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు నుండి సమస్యలను నేరుగా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును అధికారులు వ్యక్తి గతంగా పరిశీలించాలని సంబంధిత శాఖలకు వెంటనే ఎండార్స్మెంట్ చేశారు. ప్రజలకు సమయపాలనతో సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందిన ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తుదారునికి వెంటనే రశీదు అందజేయాలని, తద్వారా వారి సమస్యపై పారదర్శకత నెలకొల్పాలని ఆదేశించారు. అదేవిధంగా, దరఖాస్తు పరిష్కారానికి సంబంధించి తీసుకున్న చర్యల వివరాలను కూడా పోర్టల్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతిని ప్రాధాన్యంగా తీసుకుని, నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎటువంటి నిర్లక్ష్యం లేదా ఆలస్యం జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, జయలక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## రూ. 656 కోట్లను దాటిన 'డీమార్ట్' లాభం




**న్యూఢిల్లీ:** రిటైల్ రంగ దిగ్గజం ఎవెన్యూ సూపర్‌మార్ట్స్(డీమార్ట్) గత ఆర్థిక సంవత్సరం(2025--26) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి--మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 19 శాతం ఎగసి రూ. 656 కోట్లను అధిగమించింది. 2024--25 ఇదే కాలంలో రూ. 551 కోట్లు మాత్రమే ఆర్జించింది. ఆదాయం సైతం 19 శాతం బలపడి రూ. 17,684 కోట్లకు చేరాయి. అంతక్రితం క్యూ4లో రూ. 14,872 కోట్ల అమ్మకాలు సాధించింది. మొత్తం వ్యయాలు 19 శాతం పెరిగి రూ. 16,798 కోట్లను తాకాయి. నికర లాభ మార్జిన్లు నిలకడను చూపుతూ 3.7 శాతంగా నమోదయ్యాయి. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి డీమార్ట్ స్టోర్ల దిగ్గజం నికర లాభం 10 శాతం వృద్ధితో రూ. 2,970 కోట్లయ్యింది. మొత్తం కన్సాలిడేటెడ్ ఆదాయం 16 శాతం పుంజుకుని రూ. 68,895 కోట్లను తాకింది. క్యూ4లో ప్రారంభించిన 58 కొత్త స్టోర్లతో కలిపి వీటి సంఖ్య 500 మైలురాయికి చేరినట్లు కంపెనీ వెల్లడించింది.

## సరైన ప్రశ్నలు అడగండి.. రాత్రికి రాత్రే యాప్ రెడీ





సాఫ్ట్‌వేర్ అభివృద్ధి అంటేనే ఒకప్పుడు కంప్యూటర్ సైన్స్ ఇంజినీర్లు, వేల గంటల శ్రమ, సంక్లిష్టమైన కోడింగ్‌తో కూడిన సుదీర్ఘ ప్రక్రియ. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారుతోంది. సరైన ప్రశ్న అడగడం తెలిస్తే చాలు సాంకేతిక పరిజ్ఞానం లేకపోయినా అద్భుతాలు సృష్టించవచ్చని తాజాగా జరిగిన ఒక ఉదంతం నిరూపించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాఫ్ట్‌వేర్ తయారీ రంగాన్ని ఎలా మారుస్తుందో చెప్పే ఈ ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది.

**రాత్రికి రాత్రే ఫంక్షనల్ యాప్**

ప్రముఖ వ్యవస్థాపకుడు సందీప్ మాల్ ఎక్స్ (గతంలో ట్విట్టర్) వేదికగా పంచుకున్న ఒక పోస్ట్ టెక్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. అందులోని వివరాల ప్రకారం.. తన కుమారుడు అసలు ప్రోగ్రామింగ్ నేపథ్యమే లేని మార్కెటింగ్ గ్రాడ్యుయేట్ 'క్లాడ్' అనే ఏఐ సాధనాన్ని ఉపయోగించి కేవలం ఒక్క రాత్రిలో పూర్తి స్థాయి వెండర్ మేనేజ్‌మెంట్ యాప్‌ను రూపొందించాడని ఆయన వెల్లడించారు. ఈ యాప్‌లో కెపాసిటీ ట్రాకింగ్, క్వాలిటీ మానిటరింగ్, వర్క్ లోడ్ మేనేజ్‌మెంట్ వంటి కీలక ఫీచర్లు ఉన్నాయని, ఒక ప్రొఫెషనల్ యాప్‌కు ఉండాల్సిన అన్ని అర్హతలు ఇందులో ఉన్నాయని పేర్కొన్నారు. సాంప్రదాయ కంగా సాఫ్ట్‌వేర్ తయారీలో ప్రోగ్రామింగ్ భాషల వాక్యనిర్మాణం (సింట్యాక్స్) తెలుసుకోవడం అత్యంత కీలకం. అయితే, ఈ ఘటన తర్వాత జరుగుతున్న చర్చలో నెటిజన్లు ఆసక్తికరమైన విషయాలను ప్రస్తావిస్తున్నారు. ఏఐ యుగంలో కోడింగ్ నేర్చుకోవడం కంటే, సమస్యను ఎలా ఫ్రేమ్ చేయాలి? ఏ ప్రశ్న అడిగితే సరైన పరిష్కారం వస్తుంది? అనే జడ్జిమెంట్ (నిర్ణయాత్మక సామర్థ్యం)కు ప్రాధాన్యత పెరిగిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఒకప్పుడు ఒక సాఫ్ట్‌వేర్ ప్రాజెక్ట్ మొదలుపెట్టాలంటే టీమ్, భారీ పెట్టుబడి అవసరమయ్యేవి. ఇప్పుడు ఆ ప్రవేశ అడ్డంకులు కనుమరుగవుతున్నాయి.

# టీడీఎస్, టీసీఎస్‌లో మారిన రూల్స్

**ఎన్నారైలు, విద్యార్థులు, పర్యాటకులు**
**మదుపర్లు తెలుసుకోవాల్సింది ఇవే..**




ఈ ఆర్థిక సంవత్సరం (2026-27) మొదలు (ఈ ఏడాది ఏప్రిల్ 1) ట్యాక్స్ డిడక్టెడ్ ఎట్ సోర్స్ (టీడీఎస్), ట్యాక్స్ కలెక్టెడ్ ఎట్ సోర్స్ (టీసీఎస్) నిబంధనల్లో కొత్త మార్పులు వచ్చాయి. పన్ను ప్రక్రియల క్రమబద్ధీకరణ, తప్పులు-లోపాలను సరిదిద్దడమే లక్ష్యంగా ఈ సవరణల్ని చేశారు. టీసీఎస్ రేట్ల తగ్గింపు, ఎన్నారైల కోసం సరళతర ఆస్తి లావాదేవీలు, ట్యాక్స్‌పేయర్స్ పేపర్ వర్క్‌ను కుదించడానికి యూనిఫైడ్ టీడీఎస్ డిక్లరేషన్ ఫారం పరిచయమయ్యాయి. విదేశీ రెమిటెన్స్‌లు, ఆస్తి లావాదేవీలు, పెట్టుబడి ఆదాయం సహా అనేక రకాల ఆర్థిక లావాదేవీలను ఈ సంస్కరణలు ప్రభావితం చేయనున్నాయి. మరి పన్ను చెల్లింపుదారులు, ముఖ్యంగా ఎన్నారైలు, మదుపర్లు, విదేశాల్లో చదువుకొనే భారతీయ విద్యార్థులు, విదేశీ పర్యటనలకు వెళ్లేవారు తెలుసుకోవాల్సిందే ఏమిటో చూద్దాం..

**రెమిటెన్స్‌లు, ప్రయాణ ఖర్చులపై..**

ఏప్రిల్ 1 నుంచి విదేశీ పర్యటన ప్యాకేజీలపై టీసీఎస్ 2 శాతంగానే ఉంటుంది. ఇంతకుముందు రూ.10 లక్షల వరకున్న ప్యాకేజీలపై 5 శాతం, ఆపై 20 శాతంగా పన్ను నిర్మాణం ఉండేది. అలాగే విద్య, వైద్య విదేశీ రెమిటెన్స్‌లపై టీసీఎస్ రేటు 5 శాతం నుంచి 2 శాతానికి దిగింది. మునుపు రూ.10 లక్షలకుపైగా ఉంటే 5 శాతం టీసీఎస్ వర్తించేది. ఈ మార్పుల్ని ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించారు.

**సులువుగా ఎన్నారైలతో లావాదేవీలు**

ప్రవాస భారతీయుల (ఎన్నారైలు) నుంచి ఆస్తి కొనుగోలు చేసే భారతీయులకూ ఊరట దక్కనున్నది. ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి కొనుగోలుదారులకు ట్యాక్స్ డిడక్షన్ అకౌంట్ నెంబర్ (ట్యాన్)తో అవసరం లేదు. టీడీఎస్‌కు కొనుగోలుదారుల పర్మనెంట్ అకౌంట్ నెంబర్ (పాన్) చాలు. దీంతో ఎన్నారైలకు చెందిన ఆస్తుల కొనుగోలు లావాదేవీలు మరింత సులువుగా, వేగంగా జరుగడానికి మార్గం సుగమం కానున్నది.

**చిన్న మదుపర్ల కోసం..**

రిటైల్ ఇన్వెస్టర్ల కోసం సింగిల్ టీడీఎస్ నాన్-డిడక్షన్ డిక్లరేషన్ ఫారం పరిచయమైంది. దీంతో ఇక పేపర్ వర్క్ బాగా తగ్గడమేగాక, సమయం ఆదా అవుతుందన్న అంచనాలున్నాయి. 15జీ, 15హెచ్ ఫారాల స్థానంలో ఒకే ఒక యూనిఫైడ్ ఫారం 121ను తెచ్చారు. పన్నుసహిత ఆదాయం తక్కువగా ఉన్న వ్యక్తులు, వృద్ధులు.. అనవసరమైన టీడీఎస్ డిడక్షన్ల నుంచి తప్పించుకోవడానికి ఈ 15జీ, 15హెచ్ ఫారాలను వినియోగించేవారు. ఇప్పుడు ఫారం 121తో ఆ రెండింటి పనీ తీరిపోతుంది.

# డిగ్రీ ఉంటే సరిపోదు.. స్కిల్ ఉంటేనే జాబ్



**ముంబై:** నేటి తరం విద్యార్థుల వేతన అంచనాలకు, మార్కెట్లోని వాస్తవ పరిస్థితులకు మధ్య భారీ వ్యత్యాసం నెలకొంది. పట్టభద్రులవుతున్న విద్యార్థుల్లో దాదాపు 73 శాతం మంది రూ.5 లక్షలకు మించి వార్షిక వేతనాన్ని (ఎల్‌పీఏ) ఆశిస్తుండగా.. కేవలం 40 శాతం మంది మాత్రమే ఆ లక్ష్యాన్ని సాధిస్తున్నారని 'అన్‌స్టాప్ టాలెంట్ రిపోర్ట్ 2026' వెల్లడించింది. దేశవ్యాప్తంగా 37 వేలకు పైగా విద్యార్థులు, 500 మందికి పైగా హెచ్‌ఆర్ ప్రతినిధుల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. డిగ్రీ 'ప్రీమియం' కనుమరుగు: ఒకప్పుడు పెద్ద కోర్సులు చదివిన వారికి మాత్రమే దక్కే 'అదనపు వేతన ప్రాధాన్యం' క్రమంగా తగ్గుతోంది. ఎంబీఏ పూర్తి చేసిన వారిలో 30 శాతం మంది రూ. 10 లక్షల కంటే తక్కువ వార్షిక వేతనం పొందుతుండగా, ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లలో 39 శాతం మంది రూ. 7 లక్షల లోపు వేతనాలకే పరిమితమవుతున్నారు. దీనిని బట్టి వివిధ కోర్సుల మధ్య ఉన్న 'వేతన అంతరం' తగ్గుముఖం పడుతోందని స్పష్టమవుతోంది. విద్యార్థుల ఆలోచనా ధోరణిలో మార్పు: పెరుగుతున్న పోటీ, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు సైతం వాస్తవిక దృక్పథంతో ఆలోచిస్తున్నారు. మెరుగైన అభ్యాస అవకాశాలు, కెరీర్ వృద్ధి ఉంటే 90 శాతం మందికి పైగా విద్యార్థులు తక్కువ జీతానికైనా పనిచేసేందుకు మొగ్గు చూపుతున్నారు. అలాగే 82 శాతం మంది విద్యార్థులు తక్షణ ఆర్థిక స్థిరత్వం కోసం అదనపు ప్రయోజనాల (పెర్క్స్) కంటే చేతికి వచ్చే జీతానికే (ఇన్--హ్యాండ్ శాలరీ) ప్రాధాన్యత ఇస్తున్నారు. నైపుణ్యమే అసలైన 'గేట్‌కీపర్': ప్రస్తుత పోటీ ప్రపంచంలో నియామక ప్రమాణాలు పూర్తిగా మారిపోయాయి. ఒకప్పుడు కేవలం డిగ్రీ సర్టిఫికేట్లు చూసి ఉద్యోగాలిచ్చిన కంపెనీలు, ఇప్పుడు అభ్యర్థుల్లోని నైపుణ్యాలు (స్కిల్స్), కృత్రిమ మేధ (ఏఐ) సామర్థ్యాన్నే ప్రాతిపదికగా తీసుకుంటున్నాయి. సుమారు 64 శాతం మంది హెచ్‌ఆర్ ప్రతినిధులు ఏఐ/ఎంఎల్, డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి సాంకేతికతలపై పట్టున్న వారినే 'ప్రీమియం టాలెంట్'గా గుర్తిస్తున్నారు. భవిష్యత్తులో ప్రాబ్లమ్ సాల్వింగ్ (49%), ఏఐ పరిజ్ఞానం (39%), ఎమోషనల్ ఇంటెలిజెన్స్ (30%) వంటి సామర్థ్యాలు ఉన్నవారికే అత్యధిక డిమాండ్ ఉంటుందని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. ఎంపిక ప్రమాణాలు మారాయి: భారత ఉద్యోగ విపణిలో అవకాశాలు తగ్గలేదు, కానీ ఒక నిర్మాణాత్మక మార్పు జరుగుతోంది. నైపుణ్యం, ఏఐ పరిజ్ఞానం ఉన్నవారికి మాత్రమే అవకాశాలు దక్కుతున్నాయి. బలమైన పునాదులతో పాటు ప్రాక్టికల్ నైపుణ్యాలు, ఏఐ ప్రావీణ్యం కలిగిన అభ్యర్థులే ఈ పోటీలో నిలబడతారు" అని అన్‌స్టాప్ వ్యవస్థాపకుడు, సీఈఓ అంకిత్ అగర్వాల్ విశ్లేషించారు.

# స్పోర్ట్స్

# లీగ్ దశ ముగుస్తున్నా ధోనీ జాడేది..
# చెన్నై ఎదురుచూపులు ఫలించేనా..!



ఐపీఎల్ ప్రతి సీజన్‌లో అభిమానులకు పిచ్చెక్కించే ఎంఎస్ ధోనీ పంతొమ్మిదో సీజన్‌లో ఇంకా అడుగే పెట్టలేదు. లీగ్ దశ ముగింపు దశకు చేరుకున్నా తాలా ఆటను ఫ్యాన్స్ మిస్సవుతున్నారు. ఆరంభ సీజన్ నుంచి వికెట్ల వెనకాల కుర్రాడిలా కదులుతూ.. ఫినిషర్‌గా సీఎస్కే విజయాల్లో కీలకమైన ధోనీ 19వ ఎడిషన్‌లో ఒక్క మ్యాచ్ ఆడలేదు. ఇదుగో వస్తుండు.. అదుగో వస్తుండు అనే మాటలు వినిపిస్తున్నా.. ఈ మాజీ కెప్టెన్ ఎంట్రీపై సీఎస్కే యాజమాన్యం స్పష్టమైన ప్రకటన చేయడం లేదు. చెన్నై సూపర్ కింగ్స్‌ను ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిపిన ధోనీ పంతొమ్మిదో సీజన్‌లో ఆడడంపై నెలకొన్ని అనిశ్చితికి తెరపడడం లేదు. మొన్నటికి మొన్న జట్టుతో పాటు హైదరాబాద్ వచ్చినా అతడు ఆడలేదు. రెండు రోజుల క్రితం ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌కు ముందు నెట్స్‌లో రోహిత్ శర్మను కలిసిన ధోనీ.. తుది జట్టులో ఉంటాడని అందరూ అనుకున్నారు. కానీ, ఆశ్చర్యంగా.. ఎల్ క్లాసికో మ్యాచ్‌కు ధోనీ, హిట్‌మ్యాన్ వరసగా రెండోసారి దూరమయ్యారు. మే 5న ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్ కోసం జట్టంతా ఢిల్లీ వెళ్లగా ధోనీ చెన్నైలోనే ఉండిపోవడం అతడి రాక మరింత ఆలస్యం కానుందనే వార్తలకు బలం చేకూర్చుతోంది.

**వయసూ కారణమే..!**

పంతొమ్మిదో సీజన్ ముందు గాయపడిన ధోనీ.. కాలి పిక్క గాయం నుంచి కోలుకుంటున్నాడు. పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్ సాధించకపోవడంతోనే ఐపీఎల్ ఆడడం లేదని సమాచారం. వయసు 44 ఏళ్లు కావడంతో ధోనీ ఫిట్‌గా మారేందుకు మరికొంత సమయం పట్టనుంది. దాంతో.. చెన్నైలోనే తాలా పునరావాస కేంద్రంలో ఫిట్‌నెస్ మెరుగుపరుచుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో.. ధోనీ ఏదో ఒక దశలో అందుబాటులో ఉంటాడు అని క్రిక్‌బజ్ కథనం పేర్కొంది. పెద్దన్నలాంటి మహీ భాయ్ గైర్హాజరీలో రుతురాజ్ గైక్వాడ్ ఆరంభంలో తడబడినా ఎట్టకేలకు ట్రాక్‌లో పడ్డాడు. ఓపెనర్ శాంసన్.. మిడిలార్డర్‌లో ఉర్విల్, కార్తిక్ శర్మ.. పేసర్ అన్షుల్ కంబోజ్‌లు రాణిస్తుండగా చెన్నై నాలుగో విజయంతో ప్లే ఆఫ్స్ రేసులో నిలిచింది.

## స్వదేశానికి ఆర్సీబీ ఓపెనర్.. కోహ్లీ జోడీ అతడేనా..!

పంతొమ్మిదో సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు చేరువైన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(=జదీ) కీలక బ్యాటర్ సేవల్ని కోల్పోయింది. ధనాధన్ ఆటతో శుభారంభాలు ఇచ్చే ఓపెనర్ ఫిల్ సాల్ట్ అనూహ్యంగా స్వదేశానికి పయనమయ్యాడు. వరసగా మూడు మ్యాచ్‌లకు దూరమైన సాల్ట్ గాయంతో బాధ పడుతుండడమే అందుకు కారణం. మెరుగైన చికిత్స కోసం ఈ డాషింగ్ బ్యాటర్ ఇంగ్లండ్‌కు వెళ్లాడు. దాంతో.. అతడు తిరిగి ఎప్పుడు ఆర్సీబీ స్క్వాడ్‌లో కలుస్తాడు? అనేది తెలియడం లేదు. టాపార్డర్‌లో దంచికొడుతూ ఆర్సీబీ విజయాల్లో కీలకమైన ఫిల్ సాల్ట్ ఐపీఎల్‌కు దూరమయ్యాడు. వేలి గాయంతో బాధ పడుతున్న సాల్ట్ స్వదేశం వెళ్లాడు. అక్కడ స్కానింగ్ పరీక్షలు చేయించుకొని కోలుకున్నాక తిరిగొచ్చే అవకాశముంది. ఏప్రిల్ 18న ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్ అనంతరం సాల్ట్ మైదానంలోకి దిగలేదు. దాంతో.. సాల్ట్‌కు ఏమైంది? అని అభిమానులు ఆందోళన చెందారు. వారు భయపడినట్టే ఈ విధ్వంసక ప్లేయర్ సీజన్ మధ్యలోనే స్వదేశం బాట పట్టాడు.



**ఓపెనర్‌గా బెథెల్**

సాల్ట్ గైర్హాజరీలో విరాట్ కోహ్లీ జతగా కుర్రాడు జాకబ్ బెథెల్ ఇన్నింగ్స్ ఆరంభించడం ఖాయమైనట్టే. దూకుడైన ఆటతో ప్రత్యర్థి బౌలర్లను భయపెట్టే సాల్ట్ అందుబాటులో లేకపోవడంతో చురుకైన ఫీల్డర్‌ను కూడా బెంగళూరు కోల్పో?యింది. 18వ సీజన్‌లో ఆర్సీబీ ఛాంపియన్‌గా నిలవడంలో కీలక పాత్ర పోషించిన సాల్ట్.. 19వ ఎడిషన్‌లోనూ దంచేశాడు. కేవలం ఆరు ఇన్నింగ్స్‌ల్లోనే 168.33 స్ట్రయిక్ రేటుతో 202 రన్స్ సాధించాడు. ప్రస్తుతం రెండో స్థానంలో కొనసాగుతున్న ఆర్సీబీ మే 7న లకో?న్ సూపర్ జెయింట్స్‌ను ఢీ కొట్టనుంది.

## షాక్‌లో ఆర్సీబీ.. 18 ఏళ్ల బంధానికి స్వస్తి!



ఐపీఎల్ 2026 సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) సూపర్ ఫామ్ కొనసాగిస్తోంది. ఇప్పటివరకు సీజన్‌లో 9 మ్యాచ్‌లాడిన ఆర్సీబీ ఆరు విజయాలు సాధించి 12 పాయింట్లతో పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతోంది. ఈసారి సీజన్‌లో ఆర్సీబీ సక్సెస్ వెనుక చాలా మంది ఆటగాళ్ల కృషి దాగుంది. బ్యాటింగ్ విభాగంలో కోహ్లితో పాటు కెప్టెన్ పటీదార్, దేవదత్ పడిక్కల్, టిమ్ డేవిడ్‌లు అదరగొడుతుంటే, బౌలింగ్‌లో హాజిల్‌వుడ్, భువనేశ్వర్, సుయాశ్ శర్మ, కృనాల్ పాండ్యాలు స్థిరమైన ప్రదర్శన కొనసాగిస్తున్నారు. ఇక 19 ఏళ్లుగా ఒకే జట్టుకు ఆడుతున్న కింగ్ విరాట్ కోహ్లి ఐపీఎల్ 2026 సీజన్‌లోనూ బ్యాటింగ్‌తో అదరగొడుతున్నాడు. 9 మ్యాచ్‌ల్లో కోహ్లి 165.50 స్ట్రైక్‌రేట్‌తో 379 పరుగులు సాధించాడు. గతేడాది తొలిసారి చాంపియన్స్‌గా నిలిచిన ఆర్సీబీ వరుసగా ఈ సీజన్‌లోనూ కప్ సాధించాలని ఉవ్విళ్లూరుతోంది. అయితే ఒక వార్త మాత్రం ఆర్సీబీని తెగ బాధపెట్టేస్తోంది. అదేంటంటే 18 ఏళ్ల పాటు ఆర్సీబీ ఫిజియోగా సేవలందించిన ఎవన్ స్పీచ్‌లీకి ఆర్సీబీ ఘనంగా ఫేర్‌వెల్ ఇచ్చింది. ఆర్సీబీ జట్టు వెనుక ఎవన్ స్పీచ్‌లీ పాత్ర మరువలేనిది. 2008 నుంచి 2025 సీజన్ వరకు ఎవన్ స్పీచ్‌లీ ఆర్సీబీకి ఫిజియోగా పనిచేశాడు. ఈ 18 ఏళ్లలో ఎంతో మంది ఆర్సీబీ ఆటగాళ్ల ఫిట్‌నెస్‌తో పాటు వాళ్లు గాయాల నుంచి త్వరగా కోలుకునేందుకు ఎవన్ ఎంతో కృషి చేశారు. అయితే గత సీజన్ ముగిసిన అనంతరం ఎవన్ స్పీచ్‌లీ ఆర్సీబీ ఫిజియోగా రిటైర్ అయ్యారు. ఈ నేపథ్యంలో ఎవన్ స్పీచ్‌లీకి 'ఒక అధ్యాయం ముగిసింది' (ఎండ్ ఆఫ్ ఎరా) పేరుతో ఫేర్‌వెల్ ఘనంగా నిర్వహించింది. దీనికి సంబంధించిన వీడియోనూ ఆర్సీబీ తమ 'ఎక్స్' వేదికగా షేర్ చేసుకుంది. ఫిజియోగా రిటైర్ అయిన తర్వాత స్వదేశంలో ఉండిపోయిన ఎవన్ స్పీచ్‌లీ ఈ ఫేర్‌వెల్ వేడుక కోసం బెంగళూరుకు రావడం విశేషం. కోహ్లి సహా ఆర్సీబీ ఆటగాళ్లు, సపోర్ట్ స్టాఫ్ ఎవన్‌కు గార్డ్ ఆఫ్ హానర్‌తో గౌరవించారు. ' ఎండ్ ఆఫ్ ఎరా, ఎవన్ స్పీచ్‌లీ'. నీ లెగసీని ఆర్సీబీ ఎప్పటికీ గుర్తుం చుకుంటుంది. 18 ఏళ్లుగా ఎవన్ స్పీచ్‌లీ ఆర్సీబీకి హెడ్ ఫిజియోగా వ్యవహరించారు. అందుకే అతనికి ఘనంగా వీడ్కోలు పలుకుతున్నాం.' అని క్యాప్షన్ జత చేసింది.



## ఏంటీ ప్రభాస్ కల్కి సీక్వెల్ షూట్‌లో జాయిన్ అయ్యాడా..?

ప్రభాస్ అభిమానులతో, సైన్స్ ఫిక్షన్ జోనర్ సినిమాలను ఇష్టపడే ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టుల్లో ఒకటి 'కల్కి 2898 ఏడీ' ప్రాంచైజీ. ఇప్పటికే ఫస్ట్ పార్ట్‌తో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ప్రభాస్-నాగ్ అశ్విన్ టీం ఇక సీక్వెల్‌తో ఎంటర్‌టైన్ చేసేందుకు రెడీ అవుతున్నారని తెలిసిందే. అయితే సీక్వెల్ ఎప్పుడు సెట్స్‌పైకి వెళుందా అని ఎదురుచూస్తున్న మూవీ లవర్స్ కోసం ఇప్పటికే అమితాబ్ బచ్చన్ షూట్‌లో పాల్గొన్నట్టు ఆసక్తికర అప్‌డేట్ ఒకటి బయటకు వచ్చింది. తాజాగా మరో ఆసక్తికర వార్త బయటకు వచ్చింది. హీరో ప్రభాస్ నేడు కల్కి సీక్వెల్ షూట్‌లో జాయిన్ అయ్యాడట. ఎక్కువగా నైట్ షూట్స్ ఉండనుండగా.. కొన్ని రోజులపాటు ఈ షెడ్యూల్‌లో పాల్గొనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రభాస్ షూట్‌కు సంబంధించి మేకర్స్ ఏమైనా అప్‌డేట్స్ అందిస్తారేమో చూడాలి. కాగా ఫస్ట్ పార్ట్‌లో దీపికా పదుకొనే పోషించిన సుమతి పాత్ర కోసం సీక్వెల్‌లో ఇంకా ఏ నటిని ఫైనల్ చేయలేదు మేకర్స్. కమల్ హాసన్‌తోపాటు పలువురు కీలక నటీనటులు సీక్వెల్‌లో కనిపించబోతున్నట్టు తెలుస్తుండగా.. మేకర్స్ నుంచి అప్‌డేట్ రావాల్సి ఉంది. భారీ విజువల్ వండర్‌గా మారిన 'కల్కి 2898 ఏడీ'లో ప్రభాస్, దీపికా పదుకొణె, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ లాంటి లీడ్‌యాక్టర్లు నటించడంతో ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. భారీ విఎఫ్ఎక్స్, యూనిక్ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల మన్ననలు పొందింది. ఫస్ట్ పార్ట్‌ను తెరకెక్కించిన వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై సీ అశ్వనీదత్ ఈ చిత్రాన్నినిర్మించనున్నారు.

## బాడీ షేమింగ్‌తో నరకం చూశా.. 15 రోజులు ఆసుపత్రిలో చికిత్స





ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్ట్ సురేఖా వాణి కుమార్తెగా ప్రేక్షకులకు పరిచయమైన సుప్రిత ఇటీవల తన వ్యక్తిగత జీవితంలోని కఠిన అనుభవాలను గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. సోషల్ మీడియా స్టార్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె, ప్రస్తుతం హీరోయిన్‌గా సినీ రంగంలో ముందుకు సాగుతున్నారు. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ సుప్రిత, సోషల్ మీడియాలో ఎదురైన విమర్శలు, బాడీ షేమింగ్ కామెంట్లు తనపై తీవ్ర ప్రభావం చూపాయని చెప్పారు. బరువు తగ్గాలనే ఆరాటంలో తాను అనుసరించిన తప్పుడు ఆహారపు అలవాట్లు తన ఆరోగ్యాన్ని పూర్తిగా దెబ్బతీశాయని వెల్లడించారు.రోజుకు 15 గంటల పాటు ఏమీ తినకుండా ఉండి, తర్వాత ఒక్కసారిగా హెవీ ఫుడ్ తీసుకునేదాన్ని. దీంతో వాంతులు, తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చాయి. 15 రోజుల పాటు ఆసుపత్రిలో ఉండాల్సి వచ్చింది. నీళ్లు తాగినా కూడా పడని పరిస్థితి. ఆ నొప్పి తట్టుకోలేక ఒక దశలో 'నన్ను చంపేయండి' అని అమ్మను అడిగాను అంటూ తన అనుభవాన్ని వివరించారు.

# బన్నీ సీక్రెట్స్ వైరల్.. అల్లు అర్జున్‌పై శిరీష్ సరదా కామెంట్స్!



పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన అల్లు అర్జున్ ప్రస్తుతం దేశవ్యాప్తంగా భారీ క్రేజ్‌ను సొంతం చేసుకున్నాడు. ముఖ్యంగా 'పుష్ప' సినిమాతో ఆయన రేంజ్ అమాంతం పెరిగిపోయింది. ఉత్తరాదిలో కూడా విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుని, టాప్ స్టార్‌ల సరసన నిలిచాడు. దీంతో బన్నీతో సినిమా చేయడానికి పలువురు దర్శకులు ఆసక్తి చూపుతున్నారు. ఇలాంటి సమయంలో ఆయన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ పాత వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో ఆయన తమ్ముడు అల్లు శిరీష్ చేసిన కామెంట్స్ నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. గతంలో అల్లు శిరీష్, నటుడు అలీ హోస్ట్ చేసిన 'అలీతో సరదాగా' కార్యక్రమానికి అతిథిగా హాజరయ్యాడు. ఆ సందర్భంగా తన అన్న అల్లు అర్జున్ గురించి సరదాగా మాట్లాడుతూ చిన్నప్పటి జ్ఞాపకాలను పంచుకున్నాడు. శిరీష్ మాట్లాడుతూ, చిన్నప్పుడు బన్నీకి చదువు అంతగా రాదని సరదాగా చెప్పాడు. "అమ్మ రాత్రంతా కూర్చోబెట్టి ఎంత చదివించినా, ఉదయానికి చదివింది మొత్తం మర్చిపోయేవాడు. పరీక్షల్లో కూడా పెద్దగా రాసేవాడు కాదు" అంటూ నవ్వుతూ చెప్పిన వ్యాఖ్యలు ఇప్పుడు మళ్లీ వైరల్ అవుతున్నాయి. ఇక మరో సందర్భంలో తమ అన్నదమ్ముల మధ్య ఉన్న అనుబంధాన్ని కూడా శిరీష్ వివరించాడు. "నేను ఏ కొత్త డ్రెస్ వేసుకున్నా ముందుగా బన్నీ వేసుకునేవాడు. తర్వాత నేను వేసుకుంటే అందరూ 'ఇది బన్నీ డ్రెస్ కదా' అని అడిగేవారు" అంటూ చిన్ననాటి సంఘటనలను గుర్తు చేసుకున్నాడు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుండగా, అభిమానులు సరదాగా కామెంట్స్ చేస్తున్నారు. కొందరు బన్నీ చిన్నప్పటి విషయాలు తెలిసి ఆశ్చర్యపోతుండగా, మరికొందరు అన్నదమ్ముల బాండింగ్‌ను మెచ్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా, అల్లు అర్జున్ ప్రస్తుతం తన తదుపరి ప్రాజెక్ట్‌తో బిజీగా ఉన్నాడు. 'పుష్ప 2' విజయానంతరం ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'రాకా'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు దర్శకుడు అట్లీ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల విడుదలైన టైటిల్ పోస్టర్‌లో బన్నీ లుక్ పూర్తిగా భిన్నంగా ఉండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.



## 'వారణాసి' షూటింగ్‌కు నీటి కష్టాలు... రాజమౌళి ప్లాన్‌కు బ్రేక్ పడిందా!

సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న 'వారణాసి' సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. భారీ బడ్జెట్‌తో శ్రీ దుర్గా ఆర్ట్స్, షోయింగ్ బిజినెస్ బ్యానర్లపై నిర్మితమవుతున్న ఈ చిత్రం కోసం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా భారీ సెట్లు నిర్మించారు. ముఖ్యంగా రాజేంద్రనగర్‌లోని గగన్‌పహాడ్ ప్రాంతంలో వేసిన సెట్స్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు.తాజాగా ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. సినిమాలో భాగంగా నీటి అడుగున జరిగే కొన్ని సన్నివేశాలను చిత్రీకరించేందుకు రాజమౌళి ప్లాన్ చేశారట. ఇందుకోసం భారీ స్థాయిలో నీరు అవసరమవుతుందని, దాదాపు 10 వేల లీటర్ల సామర్థ్యం గల 150 ట్యాంకర్ల నీటిని సరఫరా చేయాలని నిర్మాణ సంస్థ హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ను సంప్రదించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఎండలు తీవ్రంగా ఉండటం, నగరంలో నీటి డిమాండ్ అధికంగా ఉండటంతో ఈ అభ్యర్థనను వాటర్ బోర్డ్ తిరస్కరించిందని వార్తలు వినిపిస్తున్నాయి. సరఫరా చేసే నీటిని శుద్ధి చేసి వినియోగించుకోవాలని, ట్యాంకర్ ఛార్జీలను నిర్మాతలే భరిస్తారని లేఖలో పేర్కొన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో అంతటి నీటిని అందించడం సాధ్యం కాదని అధికారులు తెలిపినట్లు సమాచారం. అయితే ఈ విషయంపై అధికారిక ధృవీకరణ ఇంకా వెలువడలేదు. ఇక మరోవైపు మహేష్ బాబు ఇటీవల జర్మనీకి వెళ్లి బ్లాక్ ఫారెస్ట్‌లో ట్రెక్కింగ్, ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. త్వరలోనే తదుపరి షెడ్యూల్ ప్రారంభం కానుండగా, మే 18 నుంచి అండర్‌వాటర్ సన్నివేశాల షూటింగ్ చేపట్టాలని చిత్రబృందం యోచిస్తోంది. ఈ సినిమాలో మహేష్ బాబు ద్విపాత్రాభినయం పోషిస్తుండగా, 'రుద్ర' మరియు 'శ్రీరాముడు' పాత్రల్లో కనిపించనున్నారని టాక్. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రకాశ్ రాజ్ వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కథను విజయేంద్ర ప్రసాద్ అందిస్తుండగా, సంగీతాన్ని ఎం.ఎం. కీరవాణి సమకూరుస్తున్నారు. 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ భారీ చిత్రం గురించి వస్తున్న ప్రతి అప్డేట్ అభిమానుల్లో మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రస్తుతం నీటి వివాదం నిజమా కాదా అన్నది క్లారిటీ రావాల్సి ఉంది.

## త్రిష బర్త్ డే స్పెషల్.. పోస్టర్ విడుదల, అవనిగా మెప్పించనున్న చెన్నై చంద్రం

మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ ఎపిక్ 'విశ్వంభర' సినిమా ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా నటి త్రిష కృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఆమె క్యారెక్టర్ లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఈ పోస్టర్‌లో త్రిష ట్రెడిషనల్ లుక్‌లో డివైన్ ఔరాతో కనిపిస్తూ ఆకట్టుకుంది. అయితే ఇది కేవలం గ్లామర్ పాత్ర మాత్రమే కాదని, కథలో కీలక పాత్ర పోషించబోతుందని స్పష్టమైన సంకేతాలు ఇస్తోంది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, త్రిష పోషిస్తున్న 'అవని' పాత్ర సినిమా కథలో కీలక మలుపులు తీసుకువచ్చే ప్రధాన అంశంగా ఉండనుంది. ముఖ్యంగా ఈ పాత్ర చుట్టూనే సినిమా నెరేషన్ తిరిగే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. ఇప్పటివరకు త్రిష చేసిన పాత్రలతో పోలిస్తే, ఈ పాత్రలో ఎక్కువ ఎమోషనల్ వెయిట్, డెప్త్ ఉండబోతుందని తెలుస్తోంది. కేవలం స్క్రీన్ ప్రెజెన్స్‌కే పరిమితం కాకుండా, కథను ముందుకు నడిపించే డ్రైవింగ్ ఫోర్స్‌గా అవని పాత్ర ఉండటం ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. గత కొన్నేళ్లుగా సెలెక్టివ్ ప్రాజెక్ట్స్‌తో ముందుకు సాగుతున్న త్రిషకు 'విశ్వంభర' ఒక స్ట్రాంగ్ కంబ్యాక్‌గా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాలో పవర్‌ఫుల్ పాత్ర దక్కడం ఆమె కెరీర్‌కు మరో మైలురాయిగా మారవచ్చని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇక మెగాస్టార్ చిరంజీవి-త్రిష కాంబినేషన్ కూడా ఈ సినిమాకు మరో ప్రధాన హైలైట్. గతంలో వీరిద్దరి మధ్య ఉన్న ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఇప్పుడు సోషియో ఫాంటసీ బ్యాక్‌డ్రాప్‌లో వారి పాత్రలు ఎలా మలచబడ్డాయో అన్నది ఆసక్తికరంగా మారింది. ఈ ఇద్దరి ట్రాక్ సినిమా ఎమోషనల్ కోర్‌గా నిలుస్తుందని టాక్. ఈ చిత్రానికి దర్శకుడు వశిష్ట విజువల్ ట్రీట్ ఇవ్వడానికి భారీ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. హాలీవుడ్ స్థాయి వీఎఫ్ఎక్స్ స్టూడియోలు ఈ ప్రాజెక్ట్‌పై పనిచేస్తున్నాయని సమాచారం. దీంతో 'విశ్వంభర' విజువల్‌గా కూడా అద్భుతంగా ఉండనుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో వేగంగా కొనసాగుతోంది. యువీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం టాలీవుడ్‌లో నెవర్ బిఫోర్ అనిపించే స్థాయిలో ప్రేక్షకులను అలరించే లక్ష్యంతో రూపొందుతోంది. మేకర్స్ త్వరలోనే రిలీజ్ డేట్‌ను ప్రకటించే అవకాశముంది.




Editor, Publisher & Owner by Reddy Shekar, 3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463